## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:357 | శనివారం ఆగస్ట్ 01, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## పీఎం కిసాన్ పథకం.. మరో ఐదేళ్లు




2లో



## భోగాపురానికి ఎయిరిండియా షెడ్యూల్ ప్రకటన

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్న భోగాపురం ఎయిర్‌పోర్టులో ఆగస్టు 17 నుంచి విమానాల రాకపోకలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో ఎయిరిండియా అక్టోబర్ 24 వరకు ఫ్లైట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్-భోగాపురం మధ్య రోజుకు 5 సర్వీసులు, బెంగళూరు-భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులతో పాటు, ఆది, శుక్రవారాలు మినహా మిగిలిన 5 రోజులు మరో సర్వీసును నడుపుతామన్నారు. విజయవాడ-భోగాపురం మధ్య రోజుకు 4 సర్వీసులు నడపనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

# టేకాఫ్‌కు ఉత్తరాంధ్ర సిద్ధం..

## మోదీజీ మీ రాకకోసం ఎదురుచూస్తున్నాం: చంద్రబాబు



- భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.
- దీనిని దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా ప్రధాని పేర్కొన్నారు.
- ప్రధాని పోస్టును సీఎం చంద్రబాబు షేర్ చేస్తూ, "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది.. మోదీజీ మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం" అన్నారు.
- విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.
- పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా.



అమరావతి: భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "రేపు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నాం. ఇది దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో కీలక మైలురాయి" అని తెలిపారు.
ప్రధాని పోస్ట్‌ను సీఎం చంద్రబాబు షేర్ చేశారు. "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది. మోదీజీ.. మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని.. పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

# పేరు గొప్ప - ఊరు దిబ్బ..!

## అన్నట్లుంది అధికారుల తీరు:- పవన్ కళ్యాణ్ సారు..!!?

రియల్ ఎస్టేట్ మాఫియా దౌర్జన్యం..!?






- రైల్వే కోడూరు మండలంలో అక్రమంగా కాల్వ భూముల కబ్జా..!!
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ మరియు "కుడా" అధికారులు..!!
- "పి జి ఆర్ ఎస్".. లో కంప్లైంట్ ఇచ్చి ప్రశ్నించిన వారిపై న బెదిరింపులు..!?

2లో

### బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

## చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

## అభిమాన నాయకుడు మరణంతో విషాదం

**వరంగల్, జూలై 31:** తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు.

**రైతు బాంధవుడిగా చిరస్మరణీయ సేవలు**

- దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నర్సంపేటకు తీసుకొచ్చారు
- పాకాల సరస్సును నింపి నియోజకవర్గానికి సాగునీటి వరం అందించారు
- మాధన్నపేట వాగుపై సిద్ధం నిర్మాణం చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి
- రైతు బాంధవుడిగా ప్రతి ఒక్కరి మనసులో చిరస్థాయిగా నిలిచిన సుదర్శన్ రెడ్డి



- ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో హనుమకొండలోని రోహిణి
- ఆసుపత్రిలో చేరిక ప్రాథమిక చికిత్స అనంతరం యశోద
- ఆసుపత్రికి తరలింపు కేటీఆర్, హరీష్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు
- తరలింపు గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 12.51కి కన్నుమూత

ప్రజల కోసం పనిచేసిన రైతు బాంధవుడు
(1966 - 31-07-2026)

"అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు"
- పెద్ది సుదర్శన్ రెడ్డి

**ఉద్యమంలో ముందుండి..**

- కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్‌లో చేరి కేసీఆర్ వెంట నడిచిన నిబద్ధత గల నేత
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన మొదటి వరుస నాయకుడు
- వరంగల్ ప్రకాష్‌రెడ్డిపేటలో ప్రపంచ స్థాయి భారీ బహిరంగ సభకు అధ్యక్షత వహించిన నాయకుడు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో టిఆర్ఎస్ నిర్వహించిన అన్ని ప్రధాన సభల బాధ్యతలు చేపట్టిన నేత
- ఎలక్ట్రిసిటీలో జరిగిన టిఆర్ఎస్ భారీ సభ నిర్వహణ కూడా ఆయనదే

పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ ప్రజలు సంతాపం తెలియజేస్తూ తమ నివాళులు అర్పిస్తున్నారు.

2లో

## తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా



పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం
పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత

2లో

## ఉద్యమ సహచరుడిని కోల్పోయా

### పెద్ది మృతికి హరీష్ సంతాపసం

ఉద్యమ సహచరుడు, సోదరుడు, మంచి మనసున్న మనిషి పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి,



2లో

## నిబద్ధత కలిగిన ఉద్యమనాయకుడు పెద్ది



2లో

### మా కుతంత్రాలతో

## అభివృద్ధిని అడ్డుకోలేరు



- భోగాపురం విమనాశ్రాయం ప్రారంభానికి సిద్ధం
- జగన్‌కు ఎంపి పల్లా శ్రీనివాసరావు హెచ్చరిక

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరోసారి విరుచుకుపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రాకు మణిహారమని గుర్తు పెట్టుకో జగన్ అని అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. కేవలం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ఆటంకం కలిగించేందుకే విశాఖకు జగన్ వచ్చారని ఆరోపించారు. కుతంత్రాలతో అభివృద్ధిని ఆపలేరని పల్లా అన్నారు. రానున్న కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. గాజువాక నుంచి125, జిల్లా మొత్తం 5000 వేల బస్సుల్లో 5 లక్షల మంది ప్రజలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యేకంగా దర్శించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్మించడం వల్ల అంతర్జాతీయంగా వ్యాపారస్థులు ఉత్తరాంధ్రకు రావడం అలాగే పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

2లో

# సంపాదకీయం

## సింహాసనం వణికింది!







ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న నియంతను ఒక హాస్యాస్పదమైన కేతిగాడిగా చూపించడం ద్వారా నియంతల గురించి ప్రజల్లో పేరుకుపోయిన భయాన్ని తొలగించడానికే తాను 'ది గ్రేట్ డిక్టేటర్' సినిమా తీశానన్నాడు చార్లీ చాప్లిన్. ఢిల్లీలో బొద్దింకలూ అదే పని చేశాయి. నియంతలు కూడా భయపడతారు. దిగివస్తారు. వెనక్కి తగ్గుతారు. అవసరమైతే తమ మంత్రులను కూడా బలి ఇస్తారు.

ఇంతకాలం ఒక నారటివ్‌ను మన చేత నమ్మించారు: భారత ప్రధాని సర్వశక్తిమంతులు, సర్వజ్ఞులు. వారు అనుకున్నదే జరుగుతుంది. ఎంతటివారైనా వారి పాదాక్రాంతం కావాల్సిందే. వారు హిమాలయాలంత ఎత్తులో ఉంటే, దేశంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట మాత్రమే. ప్రజాస్వామ్యానికి మూడు మూలస్తంభాలైన న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు, అనధికారికంగా నాలుగో స్తంభంగా భావించే మీడియా-- అన్నీ వారి కనుసన్నల్లోనే కదులుతున్నాయనే భావనను ప్రజల్లోకి నెట్టారు. ఈ భావన ఎంత బలంగా మారిందంటే... ప్రజాస్వామ్యం ఉందా లేదా అన్న ప్రశ్న కంటే, అధికారాన్ని ఎదిరించడం సాధ్యమా కాదా అన్నదే అసలు ప్రశ్నగా మారిపోయింది. షాహీన్ బాగ్ వచ్చింది, వాళ్లను పాకిస్థానీయులన్నారు. రైతులు ఉద్యమించారు, వాళ్లను ఖలిస్థానీయులన్నారు. మహిళా రెజ్లర్లు న్యాయం అడిగితే, వారి మీదే నిందల దాడులు చేశారు. ఈ ఉద్యమాలన్నీ ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రశ్నలనే లేవనెత్తాయి. కానీ వాటికి ఒక పరిమితి ఉంది. కాబట్టి వాటి మీద ఒక నిర్దిష్ట ప్రయోజనాలున్న సామాజికవర్గాల ఉద్యమాలంటూ ముద్ర వేయగలిగారు. ఆ విధంగా ఈ ఉద్యమాలను మిగతా సమాజం నుంచి వేరు చేయడం అధికారానికి సులభమైంది.

కానీ బొద్దింకల ఉద్యమం ఆ వ్యూహాన్ని తలకిందులు చేసింది. ఇది ఒక సామాజిక వర్గం ఉద్యమం కాదు. ఒక మత ఉద్యమం కాదు. కుల ఉద్యమం కాదు. ఇది పిల్లల ఉద్యమంగా మొదలై క్రమంగా తల్లిదండ్రుల ఉద్యమంగా విస్తరించింది. చివరికి, దేశం మొత్తం తన పిల్లల భవిష్యత్తు గురించి ప్రశ్నించే ఉద్యమంగా మారింది.

బొద్దింక అన్న అవమానాన్ని వాళ్లు ఆత్మగౌరవంగా మార్చుకున్నారు. "పిల్లలు ఏం చేస్తారు?" అన్న చిన్నచూపును "పిల్లలు ఏదైనా చేయగలరు" అనే సత్యంగా మార్చారు. అమ్మాయిలు ఢిల్లీ వీధుల్లో నిలబడి గోదీ మీడియాను ప్రశ్నిస్తారని ఎవరూ ఊహించి ఉండరు. "మమ్మల్ని పాకిస్థానీయులంటున్నారు. పాకిస్థాన్ వెళ్లి బిర్యానీలు తిన్నవాళ్లు ఎవరు?" అని వాళ్లు అడిగారు. ఆ ఒక్క ప్రశ్నలోనే ఎన్నో సంవత్సరాల రాజకీయ ప్రచారానికి సమాధానం ఉంది. "మేము నమ్మే దేవుని ఆలయాలను మూసివేశారు. కానీ అల్లా ఇంటినీ, గురుద్వారాలనూ మా కోసం తెరిచి ఉంచారు" అని హిందూ సమూహం చెబుతుందని ఎవరూ ఊహించి ఉండరు. మతాన్ని రాజకీయ ఆయుధంగా ఉపయోగించే వారికి అది చాలా అసౌకర్యకరమైన వ్యాఖ్య.

ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తి దళితుడా కాదా అని ప్రజలు చూడలేదు. అతను తమ సమస్యను పరిష్కారం దిశగా తీసుకెళుతున్నాడా లేదా? అన్నదే చూశారు. ఇది చిన్న విషయం కాదు.

నీట్ ప్రశ్న పత్రాల లీక్ నుంచి మొదలైన డిమాండ్ మరింత పెద్దదైంది. "కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి. ప్రభుత్వం ఇంకా బెట్టుచేస్తే, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని కూడా అడగగలం" అన్న స్థాయికి ఉద్యమం చేరింది. అదే కీలక మలుపు. గత పన్నెండు సంవత్సరాల్లో ఏ పార్టీ అయినా, ఏ సంఘమైనా, ఏ ఉద్యమమైనా సింహాసనాన్ని ఈ స్థాయిలో భయపెట్టిందా? బహుశా లేదు. ఇప్పుడు సింహాసనం బెదిరింది. ముప్పు తన వైపుకే వస్తున్నప్పుడు, ఒక మంత్రిని వదిలించుకోవడం మంచిదని సింహాసనం భావించింది.

ఢిల్లీలో విద్యార్థినులు ఫైజ్ అహ్మద్ ఫైజ్ గీతాన్ని పాడుతూ తిరిగారు. "కిరీటాలు గాల్లో ఎగురుతాయి. సింహాసనాలు పక్కకు ఒరుగుతాయి". ఆ గీతం తన ప్రభావాన్ని కోల్పోలేదు. ఎందుకంటే చరిత్రలో ఏ సింహాసనమూ శాశ్వతం కాదు. మాయల ఫకీరు ప్రాణం ఎక్కడుందో ప్రజలకు ఇప్పుడు తెలిసిపోయింది. అది ఒక మంత్రిలో లేదు. అది ఒక పార్టీ కార్యాలయంలో లేదు. అది ప్రజల భయంలో ఉంది. ఆ భయం పోయిన రోజు... మాయల ఫకీరు శక్తులన్నింటినీ కోల్పోతాడు. ఈ ఉద్యమం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా నిరూపించింది. నాయకుడు అన్నీ తాను కాకూడదు. ప్రజలు ఉద్యమించేలా చేయాలి. ఇది సీట్ల కోసం, పదవుల కోసం, కూటముల కోసం పరస్పరం తగువులాడుకుంటూ రోజురోజుకూ బలహీనపడుతున్న విప క్షాలకు ఒక గుణపాఠం. ప్రజల సమస్యలను ముందుకు పెట్టండి. ప్రజలను వీధుల్లోకి తీసుకురండి. ప్రజలకు నాయకత్వం అప్పజెప్పండి. అదే ప్రజాస్వామ్యం.

ఒక మంత్రిని తప్పించినంత మాత్రాన నీట్ పరీక్షా వ్యవస్థ మారలేదు. కార్పొరేట్ విద్యా సామ్రాజ్యం కూలిపోలేదు. ప్రశ్న పత్రాల లీకేజీలకు శాశ్వత పరిష్కారం రాలేదు. అయినప్పటికీ ఇది ఒక మహత్తరమైన విజయమే! ఎందుకంటే, నిరాశతో నిండిన వాతావరణంలో, అధికారాన్ని ప్రశ్నించడం సాధ్యమేనని ఇది నిరూపించింది.

ఈ విజయం ఒక్కరోజులో రాలేదు. సర్ ప్రక్రియతో ఓ జ్ఞాని దేశంలో బోలెడంత అభాసుపాలయ్యారు. ప్రజా సమస్యల్ని లేవనెత్తేవారిని బొద్దింకలంటూ ఇంకో న్యాయమూర్తి సూర్యకాంతులు వెదజల్లారు. అలా తిట్టు నుంచి బొద్దింకల పార్టీ పుట్టింది. జనం నవ్వారు. "ఇదో పిల్లల వ్యవహారం" అన్నారు. అప్పుడు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వాళ్ల చేతికి నీట్ ప్రశ్న పత్రాల లీక్ అనే ఆయుధాన్ని అందించారు.

అభిజిత్ దీప్కే దాన్ని వరంగా చూశాడు. కళ్లకు అద్దుకున్నాడు. విద్యార్థుల ఆగ్రహాన్ని ఉద్యమంగా మార్చాడు. ఆ తరువాత లద్దాఖ్ ఉద్యమ నాయకుడు, ప్రజా శాస్త్రవేత్తగా పేరుగాంచిన సోనమ్ వాంగ్‌చుక్ రంగంలోకి వచ్చాడు. ఆయన ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులూ జంతర్ మంతర్ వైపు చూడటం మొదలుపెట్టారు. పిల్లల ప్రశ్న తల్లిదండ్రుల ప్రశ్నగా మారింది. తల్లిదండ్రుల ప్రశ్న దేశ ప్రశ్నగా మారింది. మధ్య ఆసియాలో అరబ్ స్ప్రింగ్. శ్రీలంకలో ప్రజా తిరుగుబాటు. నేపాల్‌లో జెన్--జీ. మన దేశంలో కాక్రోచెస్. పేరేదైనా కావచ్చు.

### మీ కుతంత్రాలతో

## అభివృద్ధిని అడ్డుకోలేరు

మొదటిపేజీ తరువాయి

బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రావడం వల్ల ఎన్నో పరిశ్రమలు వచ్చాయని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర.. స్వర్ణాంధ్ర బాటలో వెళ్లి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. ఇకపై ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఆగుతాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## పీఎం కిసాన్ పథకం.. మరో ఐదేళ్లు

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తోన్న పీఎం-కిసాన్ పథకాన్ని మరో ఐదేళ్లు (2030-31 ఆర్థిక సంవత్సరం వరకు) పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం రానున్న ఐదేళ్లకు గాను రూ.3.15 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

ఐదేళ్లలో 5000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.5070 కోట్లు కేటాయించింది. ఖేలో ఇండియాకు రూ.29వేల కోట్లు, సముద్ర మంథన్ పథకానికి రూ.84వేల కోట్లు, సొరంగాల నిర్మాణం కోసం రూ.9779 కోట్లు కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

## ఇందిరమ్మ టవర్స్‌కు

### టెండర్ ప్రారంభం

హైదరాబాద్,జూలై3: ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ పక్రియ ప్రారంభం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్దిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు.

## భారీ వర్షాలతో ముందస్తు జాగ్రత్తలు

**గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం**

**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడి**

గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాత్రికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. సుమారు 10 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే, రేపు సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. సుమారు 13 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల ఉండొచ్చని అంచనా వేశారు. జిల్లాలోని 19 మండలాలపై వరద ప్రభావం ఉందని కలెక్టర్ వెల్లడించారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని 16 - 17 మండలాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 32 లంక గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయని, వరద ప్రభావం నేపథ్యంలో జిల్లా అధికారుల సెలవులను మూడు, నాలుగు రోజుల పాటు రద్దు చేసినట్లు తెలిపారు. నీటిమట్టం అంతకంతకూ పెరుగుతున్నందున గోదావరిలోకి ఎవరూ దిగవద్దని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పడవ ప్రయాణాలపై తాత్కాలిక ఆంక్షలు విధించామని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు.

## పేరు గొప్ప - ఊరు దిబ్బ..! అన్నట్లుంది అధికారుల

## తీరు:- పవన్ కళ్యాణ్ సారు..!!?

మొదటిపేజీ తరువాయి

**తిరుపతి జిల్లా ఇన్చార్జి న్యూస్ జూలై 31 జనసముద్రం న్యూస్**




తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని రైల్వే కోడూరు మండలంలో అనంతరాజుపేట గ్రామ పంచాయితీ పరిధిలో ప్రభుత్వ కాల్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా..!! సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు... సర్వే నెంబర్ 1232, 1233 లలో రికార్డుల ప్రకారం స్పష్టంగా కాలవ (వాగు) భూమిగా ఉన్న ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు.

కాల్వ భూమిలో రోడ్లు వేసి, చదును చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బ్రిడ్జిలు నిర్మిస్తున్నప్పటికీ ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖ అధికారులు కనీసం స్పందించకపోవడం అనేక అనుమానాలకు వ్యక్తమౌతూ దారితీస్తున్నది...!

ప్రభుత్వ చెరువులు మరియు కాల్వ లు, రెవెన్యూ భూములపై రోడ్లు వేయడానికి, అక్రమంగా బ్రిడ్జిలు నిర్మించడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎవరు అనుమతినిచ్చారు...?

ఇరిగేషన్ శాఖ పాత్ర ఏమిటి...? కాల్వలపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, కాల్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారు?

రెవెన్యూ శాఖ మౌనమేందుకు...!? ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతుంటే రెవెన్యూ యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదు..!?

అక్రమ వెంచర్లకు అనుమతులున్నాయా..!? ఇక్కడ వెలుస్తున్న రియల్ ఎస్టేట్ ప్లాట్లకు గ్రామ పంచాయతీ మరియు.. కడప అర్బన్ డెవలప్మెంట్ "కుడా" నుంచి నిబంధనల ప్రకారం అధికారిక అనుమతులు ఉన్నాయా...? అని

ప్రశ్నించిన వారిపై బెదిరించి బ్రైవాంతులు గురి చేయడం జరిగిందంటూ చెప్పుకొచ్చారు..

ఈ అక్రమ తంతుపై, ప్రజాధనం, మరియు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కొరకు ఫిర్యాదు చేసిన వ్యక్తులను అధికారులే కాకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు గురిచేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు... అధికారుల అండదండలతోనే ఈ దందాలు నడుస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాస్త దూరంలో ఉన్న మంగంపేట అగ్రహారం గ్రామానికి ఏటీఎండీసీ మైనింగ్ వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, (డేంజర్ జోన్ ) గ్రామాన్ని అధికారులు ఖాళీ చేయిస్తుంటే ..!! అలాంటి ది డేంజర్ జోనుకు 100 నుండి 200 మీటర్లు అతి దగ్గరలోనే ఇలాంటి రియల్ ఎస్టేట్ అక్రమ ఏర్పాట్లు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు..!!

అక్రమాలను ప్రశ్నించే వారిని అణచివేసేలా వ్యవహరిస్తున్న అధికారుల తీరు చూస్తుంటే, వీరు ఎవరికి తలొగ్గారు...? ఎవరి సులోభాలు కోసం పనిచేస్తున్నారు..? అనే విషయాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి.. "సర్వే నెంబర్ 1232, 1233 లలో".. జరుగుతున్న అక్రమన కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అనంతరాజుపేట గ్రామ ప్రజలు, బొమ్మవరపు కాలవ ( బొమ్మవరపు చెరువు)ఆయకట్ట ప్రజలు, మేధావులు జిల్లా కలెక్టర్ వారిని కోరుతున్నామని చెప్పుకొచ్చారు .... ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే గ్రామాల నుండి ప్రజలు వచ్చి మెయిన్ రోడ్డు ను స్తంభింప చేసి బందును నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు...

## బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

మొదటిపేజీ తరువాయి

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**అభిమాన నాయకుడు మరణంతో విషాదం**

వరంగల్,జూలై31: తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది.

అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

## తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

మొదటిపేజీ తరువాయి

పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉద్యమ సహచరుడిని కోల్పోయా

**పెద్ది మృతికి హరీష్ సంతాపసం**

మొదటిపేజీ తరువాయి

విషాదానికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మృత్యువును జయించి తిరిగి వస్తారనే ఆశతో మనమంతా ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్తను జీర్ణించుకోవడం ఎంతో కష్టంగా ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన పోరాట యోధుడిగా, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన సోదరుడిగా పెద్ది సుదర్శన్ అన్న ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతారని హరీశ్‌రావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా నాకు ఒక ఉద్యమ సహచరుడిని, ఆత్మీయ సోదరుడిని కోల్పోయిన బాధ ఇది అని అన్నారు. పెద్ది సుదర్శన్ అన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ? వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హరీశ్‌రావు తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. పెద్ది అన్నకు జోహార్లు తెలిపారు.

## నిబద్ధత కలిగిన ఉద్యమనాయకుడు పెద్ది

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తనను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, విషాదానికి గురిచేసిందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం.. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కేటీఆర్ అన్నారు. ఉద్యమ ఆశయాలను జీవితాంతం నమ్మి, ప్రజల పక్షాన నిలబడి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికి కూడా తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన నిబద్ధత, సేవా తపన, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కేటీఆర్ ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు.

# గోదావరి వరద ఉధృతిపై ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి

**●మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్.**

జన సముద్రం న్యూస్ జూలై 31 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.

**లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలి**





గోదావరి నదిలో వరద ఉధృతి మరింత పెరుగుతున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు మండలాలకు చెందిన గోదావరి పరివాహక ప్రాంతాల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతోందన్నారు. సమ్మక్క బ్యారేజ్ వద్ద సుమారు 14. 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదం సంభవించే అవకాశమున్న ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో టామ్‌టామ్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

గర్భిణీలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఇప్పటివరకు 17 మంది గర్భిణీలను సురక్షితంగా ఆరోగ్య కేంద్రాలకు తరలించామని, మరో 10 మందిని తరలించే ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్‌కు వివరించారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంబులెన్స్‌లు, అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని, వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి భారీ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వాగులు, వంకలు, వరద నీటితో నిండిన రహదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు దాటకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

ప్రజలు పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, వాగులు, నదీ తీర ప్రాంతాలకు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ సందర్శకులను అనుమతించరాదని స్పష్టం చేశారు.

వరద ప్రభావానికి గురయ్యే అవకాశమున్న వృద్ధాశ్రమాలు, పాఠశాలలు, విద్యాలయ వసతి గృహాలను ముందుగానే గుర్తించి అక్కడ ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, వృద్ధులు, ఇతర బలహీన వర్గాల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పునరావాస కేంద్రాల్లో తాగునీరు, పరిశుభ్రమైన భోజనం, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, వైద్య సేవలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం పట్టణంలో వరద ప్రభావిత ప్రజల కోసం మొత్తం తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైతే అదనపు పునరావాస కేంద్రాలను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల్లోని ప్రతి గ్రామంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

టెలి కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు, వైద్య ఆరోగ్య, అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ భద్రాచలంలో స్నాన ఘట్టాల వద్ద వరద గోదావరి ఉధృతిని పరిశీలించి సహాయక చర్యల గురించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా ఎస్పీ కూడా పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ కు తాళం





**●దూరప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి**

**●ఇక్కట్లపాలవుతున్న రైతులు**

**●నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్**

జన సముద్రం న్యూస్, కోహెడ,జూలై 31:(కోహెడ ప్రసాదరావు)

తలాబుకు సముద్రం పెట్టుకొని దప్పికి ఏడ్చిన చందంగా మండల కేంద్రంలో రిపేరింగ్ సెంటర్ ఉన్న సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్న సంఘటన ఇది. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పక్కన గల ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ గత ఆరేడు నెల నుండి తాళం వేసి ఉంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇక్కడ ట్రాన్స్ఫార్మర్ల రిపేరింగ్ జరగకపోవడంతో రైతులు సదువుర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్లు తరచూ రిపేరింగ్ కు వస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో రైతులకు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని అధికారులు మండల కేంద్రంలో రిపేరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు నిర్వహించే ఈ సెంటర్ చాలా నెలల నుండి తాళం వేసి ఉండడంతో ఇక్కడి సేవలు మృగ్యం కావడం వలన రైతులు విదిలేక బెజ్జంకి హుస్నాబాద్ తదితర దూరప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో కాలయాపనతోపాటు ఆర్థిక భారం అదనంగా పడుతుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులను వివరణ కోరగా సదరు కాంట్రాక్టర్ కు ఫోన్ చేసిన స్పందించడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై కాంట్రాక్టర్ను తిరిగి సేవలు అందించేలాగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం చేయాలి





జన సముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ రిపోర్టర్ జూలై 31

రిజర్వాయర్లలో నీటిని తాగునీటికి వినియోగించాలి

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి

జిల్లా ఇంచార్జి మంత్రి మార్కెటింగ్ వ్యవసాయ చేనేత జౌళి శాఖ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సూపర్ ఎల్ నినో పై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీ లో మంత్రుల సమీక్ష

సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి మార్కెటింగ్ వ్యవసాయ చేనేత జౌళి శాఖ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు

సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల ాసముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ మేడిపల్లి సత్యంఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు

ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు

జిల్లా ఎల్ నినో ప్రణాళిక తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు

జిల్లా పరిధిలోని ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి వాటిలో నీటిమట్టం జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు.

# జిల్లాలో కురుస్తున్న వర్షాలు... కర్షకుల్లో వెల్లి విరుస్తున్న హర్షం

**●అప్రమత్తతతో ఉండాలని అధికారులకు ఆదేశాలు**

జనసముద్రం న్యూస్ కోహెడ కోహెడ జూలై 31: (కోహెడ ప్రసాదరావు)



గత కొన్ని రోజులగా వర్షాభావ పరిస్థితులతో ఆందోళనలో ఉన్న కర్షకులు రెండు మూడు రోజుల నుండి కలుస్తున్న వర్షాలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎల్.ని.నో. ప్రభావంతో కరువు పరిస్థితులు తల ఎత్తుతాయన్న వాతావరణ శాఖనిపుణుల హెచ్చరికతో రాష్ట్రవ్యాప్తంగా భయాందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వం సైతం ముందస్తు చర్యలుగా ప్రజలను అప్రమత్తం చేస్తే ముఖ్యంగా కర్షకులను ఆరతడి పంటలు మాత్రమే వేయాలంటే అవగాహనలో కల్పిస్తూ వస్తున్నారు. జూన్ మొదటి వారం నుండి కురువాల్సిన వర్షాలు జూలై 20 వరకు జాడ లేకపోవడంతో ఎల్ ని ఓ ప్రభావము అధికంగానే ఉంటుందని తద్వారా రాబోయే పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న భయాందోళనలో నెలకొనే ఉన్నాయి. కరువు పరిస్థితులు తల ఎత్తే ప్రమాదం ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వము ఎందుకు తగ్గట్టుగా అనేక సమావేశములలో ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజల్ని అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రసిద్ధ దేవాలయాల్లో వరుణ్యాగాలను సహితం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అల్పపీడన ప్రభావంతో మంగళవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న ఒక మోస్తరు నుండి భారీ వర్షాలకు అన్ని వర్గాల్లోనూ హర్షం వ్యక్తం అవుతుంది. గత మూడు రోజుల నుండి ముసురు పట్టి వర్షం పడుతూ ఏదో ఒక సమయంలో కాస్తా భారీ వర్షం కూడా కురియడం వల్ల జనం హర్షిస్తున్నారు. ముఖ్యంగా కర్షకులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సాగుపనులను వేగవంతం చేశారు. ఆరుతడి పంటలుగా వేసిన పత్తి మొక్కజొన్న ఇతర తృణధాన్య పంటలు ప్రస్తుత వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయి. అలాగే వరి నాట్లు చాలాచోట్ల పూర్తయినప్పటికిని మరికొన్నిచోట్ల బావుల్లో తగిన నీరు లేకపోవడం చే వర్షాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ప్రస్తుత వర్షాలకు దుక్కులు దున్ని వరినాట్లు వేసే పనుల్లో రైతాంగం బిజీగా ఉన్నారు. జిల్లాలోని అక్బర్ పేట బొంపల్లి, వర్గల్ మండలాల్లో 26.7మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం శుక్రవారం రోజున నమోదు కాగా మర్కుక్ మండలంలో అత్యల్పముగా 3.00 మిల్లి మీటర్ల హర్షపాతం నమోదు అయ్యింది. గత సంవత్సరం జూన్ జూలై మాసములలో కురిసిన వర్షపాతం కంటే ప్రస్తుతము కురిసిన వర్షం అతి తక్కువ అయినప్పటికీని గత కొంతకాలంగా ఎల్ .ని .నొ .ప్రభావం వలన వర్షాలు తగ్గ ముఖం పట్టి ప్రస్తుతం జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయింది. వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టాలు జరగకుండా జిల్లా యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ హైమావతి వెల్లడించారు. అలాగే అన్ని శాఖల అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను యథావిధిగా కొనసాగించాలి





**●ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి: కంద పెద్ద నర్సింహ**

రంగారెడ్డి జిల్లాన్యూస్ (జూలై 31)జనసముద్రం

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కేటాయించిన గన్‌మెన్‌లు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని తొలగించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎం.ఆర్.పి.ఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై నిరంతరం స్వరం వినిపిస్తున్న నాయకుడి భద్రతను తగ్గించడం ఆందోళన కలిగించే విషయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వివక్ష చూపుతోందా? ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్నందుకే భద్రతను తగ్గిస్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకుల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, చట్టబద్ధమైన నిబంధనల మేరకు భద్రతను యథావిధిగా కొనసాగించాలని ఆయన కోరారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, గన్‌మెన్‌లు మరియు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని తిరిగి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ మండల నాయకులు రావిచెట్టు శ్రీనివాస్, మని, కొమ్మగాళ్ల నర్సింహ, కంద రాములు, అందుగుల కృష్ణ పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు

# తేలికపాటి వర్షానికే దండేపల్లి రోడ్లు అధ్వాన్నం

**●గ్రామ పంచాయతీ నిర్లక్ష్యమే కారణం**

**●బీజేపీ శక్తి కేంద్ర ఇంచార్జ్ మాచర్ల తిరుపతి**

ఎల్కతుర్తి, జూలై 31(జనసముద్రం)



ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో కురిసిన తేలికపాటి వర్షానికే ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు జలమయమై బురదమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, రైతులు నిత్యావసర పనుల కోసం బయటకు వెళ్లాలంటే బురదలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ గ్రామ శక్తి కేంద్ర ఇంచార్జ్ మాచర్ల తిరుపతి మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న దుస్థితికి గ్రామ పంచాయతీ పాలకవర్గ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. తేలికపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపించేలా మారడం పంచాయతీ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. గ్రామంలోని రహదారుల ఇరువైపులా గడ్డి విపరీతంగా పెరిగిపోయినా, సైడ్ డ్రైనేజీలు పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోయినా వాటి తొలగింపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గడ్డి నివారణ మందు పిచికారీ చేయకపోవడం, డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతోందని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణలో సర్పంచ్, పాలకవర్గం పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. వెంటనే బురదమయమైన రహదారులపై మొరం మట్టి వేసి గుంతలను పూడ్చాలని, డ్రైనేజీలను శుభ్రపరచాలని, రోడ్ల పక్కన పెరిగిన గడ్డిని తొలగించి అవసరమైన చోట గడ్డి నివారణ మందు పిచికారీ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం కొనసాగితే గ్రామ ప్రజలను సమీకరించి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టడంతో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ గ్రామ శక్తి కేంద్ర ఇంచార్జ్ మాచర్ల తిరుపతి హెచ్చరించారు.

# మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి గారి కుమార్తె, అల్లుడికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ వెల్మా కార్పొరేషన్ చైర్మన్

జనసముద్రం న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి, జూలై 31:



మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి గారి కుమార్తె, అల్లుడి వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ వెల్మా కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ జువ్వాడి నర్సింగరావు దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది.

# ఆగస్టు 15 కల్లా గురుకుల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ

**●జిల్లా కలెక్టర్ హైమావతి**

జనసముద్రం న్యూస్ కోహెడ జులై 31 ;(కోహెడ ప్రసాదరావు)



సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ చేయడం కై క్లాత్ కటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల మరియు గురుకులాల్లో చదువే విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ ఆగస్టు 15 రోజు తప్పనిసరిగా అందించాలని ఏపిఎం లను ఆదేశించారు. వర్గల్ మండలంలో 3830 విద్యార్థులకు యూనిఫామ్ కుట్టేందుకు హైదరాబాద్ నుండి వచ్చిన క్లాత్ ను కొలత ప్రకారం కటింగ్ చెయ్యాలని క్లాత్ ఎక్కువగా వృథా కాకుండా నిర్దిష్ట పరిమాణంలో కటింగ్ చెయ్యాలని ఆదేశించారు. ఈ కటింగ్ చేసిన క్లాత్ ను వెంటనే మండలంలోని గ్రామాల్లో ఎస్ఎచ్ జీ మహిళలకు అందజేసి యూనిఫామ్ స్టిచ్చింగ్ వేగంగా కుట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏపిఎం ను ఆదేశించారు.

మహిళలు యూనిఫామ్ స్టిచ్చింగ్ విద్యార్థులకు నీట్ గా, సౌకర్యవంతంగా ధరించాలని సూచించారు.

కలెక్టర్ వెంట ఏపిఎం కిరణ్ కుమార్, సిసి లు, మహిళ సమాఖ్య అధ్యక్షులు సభ్యులు తదితరులు ఉన్నారు.

# రూ.6.50 కోట్లతో అంతాడ--దేకురాయి బీటీ రోడ్డు శంకుస్థాపన

**మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం- గిడ్డి ఈశ్వరి**

జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది జూలై 31



అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం అంతాడ గ్రామంలో రూ.6.50 కోట్ల జన్మాన్ నిధులతో నిర్మించనున్న అంతాడ--ఎద్దుమామిడి--సింగ్ధర--గంపరాయి--దేకురాయి గ్రామాల మీదుగా సుమారు 7 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణ పనులకు పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూల గిరిజన ప్రాంతాలకు సంక్షేమం, అభివృద్ధిని చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ప్రకటించని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో అంతాడ పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, కోఆపరేటివ్ చైర్మన్ సుమర్ల సాంబశివ, ఎంపీటీసీ ఇరువాడ సత్యవాణి, బీజేపీ కోఆపరేటివ్ డైరెక్టర్ రిమల చంద్రరావు, యూనిట్ ఇన్చార్జి సుంకరి బాలకృష్ణ, క్లస్టర్ ఇన్చార్జి బోనంగి సత్యవతి, మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, డైరెక్టర్లు సాంబమూర్తి, వరలక్ష్మి, రాజేశ్వరి, దేవి, సీనియర్ నాయకులు దారకొండ నారాయణమూర్తి, కో-క్లస్టర్ ఇన్చార్జి కీర్తికుమార్, పాడి వెంకటేష్, కుంశెట్టి సత్తిబాబు, గాలి చిన్నారావు, లోత సింహాచలం, మాజీ సర్పంచ్ చంద్రరావు, వైస్ ఎంపీపీ నూకాలమ్మ, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టిఐ కమిషనర్ దేశాల భూపాల్‌ను కలిసిన ప్రతినిధులు

జనసముద్రం న్యూస్ జూలై 31: డిండి



తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ ని నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండలానికి చెందిన ఆర్టిఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ తో పాటు ఆర్టిఐ ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్,రిపోర్టర్ పులిజాల గోవర్ధన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.?ఈ సందర్భంలో సమాచార హక్కు చట్టం(ఆర్టిఐ)అమలు తీరు, ప్రజలకు సమాచార హక్కు ద్వారా అందుతున్న సేవలపై చర్చించడం జరిగింది.ఆర్టిఐ కమిషనర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తీరును అభినందిస్తూ,భవిష్యత్తులో ప్రజాప్రయోజనాల కోసం మరిన్ని ఉత్తమ సేవలు అందించాలని ప్రతినిధులు ఆకాంక్షించారు.

# మండల బాడీ సమావేశం ఒక్కసారి కూడా ఏర్పాటు చేయలేని వాళ్ళు ఇన్చార్జిని విమర్శించే స్థాయా మీది

జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది జూలై 31



అల్లూరి జిల్లా
కొయ్యూరు మండలం రత్నం పేట పంచాయతీలో7 సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ప్రస్తుత కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ సమ్మర్ల సాంబశివ. మరో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దారకొండ నారాయణమూర్తి అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది
వీరు మాట్లాడుతూ కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షుడు కాకూరి చంద్రరావు అధ్యక్షుడిగా ఎన్నికయి కొయ్యూరు మండలంలో సంవత్సరం పైనే అవుతుంది కనీసం మండల స్థాయిలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను కలిపి ఒక్క మండల బాడీ మీటింగ్ కూడా పెట్టలేని అసమర్ధుడివి నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి విమర్శించే స్థాయానిది కాదు.వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి బాదుడే బాదుడు కార్యక్రమాలను పార్టీ చేయమని ఇస్తే రావణా పల్లి పంచాయతీలో కార్యక్రమం చేయడానికి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి వస్తే పార్టీకి రాజీనామా చేస్తానన్న వ్యక్తివి అదే అప్పటి వైసిపి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గడపగడపకు ప్రోగ్రాంకు రావణాపల్లి వస్తే పంచాయతీలో భోజనాలు వండిపెట్టి దగ్గరుండి తిప్పిన వ్యక్తివి నువ్వు పార్టీ కోసం పనిచేసే ఈశ్వరిని కొయ్యూరు మండల క్లస్టర్ యూనిట్ బూత్ నామినేటెడ్ పదవుల్లో ఉన్నటువంటి వ్యక్తులను విమర్శించే స్థాయి నీకు లేదు.మన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం వైసిపి నాయకులతో మాట్లాడవద్దు అని కరాకండిగా చెప్తుంటే మీరు పబ్లిక్ గా శంకుస్థాపనలు ఆయా కార్యకర్తలకు జాయినింగ్ ఆర్డర్లు వైసీపీ నాయకులతో కలిసి ఇచ్చే మీరు మమ్మల్ని విమర్శించే స్థాయా మీది అన్నారు.గొలిసింగి సత్యనారాయణ అనే వ్యక్తికి ఆ రోజు ఎంపీపీగా కోరం సాలకపోతే అప్పటి వైసిపి పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నటువంటి గిడ్డి ఈశ్వరి ముగ్గురు ఎంపీటీసీల్ని మద్దతు ఇచ్చి ఆరోజు ఎంపీపీ చేయడం జరిగింది.
తర్వాత ఇంచార్జి గిడ్డి ఈశ్వరి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన తర్వాత అదే గొలిసింగి సత్యనారాయణని మండల పార్టీ అధ్యక్షుని చేసిన వ్యక్తి గిడ్డి ఈశ్వరి అని మర్చిపోయారా?అలాగే ఈరోజు కొర్రు రామ్మూర్తి అనే వ్యక్తికి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి పదవిని గిడి ఈశ్వరి నియమిస్తే ఆ పదవుల పేరు చెప్పుకొని గిడ్డి ఈశ్వరి విమర్శిస్తే మీకు నైతిక విలువలు ఎక్కడ ఉన్నట్ల అని ప్రశ్నించారు.
దుచ్చరి చిట్టిబాబు,
గాడి శ్రీ రామ్మూర్తి మీరు సీనియర్లుగా ఇలాంటి తప్పుడు స్టేట్మెంట్లు ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్. మీరు ఎప్పుడైనా మండలంలో కార్యకర్తలు అందరిని కూర్చోబెట్టి ఒక్కసారైనా మీటింగ్ పెట్టారా? కార్యకర్తలతో మాట్లాడారా?
కొయ్యూరు మండలంలో వైసీపీతో కలిసి పబ్లిక్ గా పని చేసేంది ఎవరో? ఎలక్షన్ వచ్చేసరికి అన్ని పార్టీల దగ్గర డబ్బులు దండుకునేది ఎవరో? అందరికీ తెలిసిన విషయమే! మొన్న జరిగిన ఎన్నికల ముందు నర్సీపట్నంలో అప్పటి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వర్ రాజు నర్సీపట్నంలో ఎవరింట్లో పెట్టి మీ దగ్గర ఉన్నటువంటి నాయకులు ఎంత మంది వెళ్లి ఆయన్ని కలిసి డబ్బులు తెచ్చుకున్నారో ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే.పార్టీ కోసం ఎవరు పని చేస్తున్నారో? పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తెలుసు. ఈరోజు చేసే ప్రతి ఒక్కరు పని "మై టిడిపి యాప్లో" బాబు గారి డాష్ బోర్డులో ఉంటుంది.మీరు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదు. ఈ రోజు బాబు గారు 40 రోజుల్లో ఎలక్షన్ అనేసరికి ఈరోజు పదవుల కోసం సీనియర్లు అంటూ చెప్పుకోడానికి సిగ్గులేదా? పార్టీ కోసం పనిచేస్తున్న వాళ్ళని వైసీపీ వాళ్ల అంటారా? వైసిపి వాళ్ళు ఎవరో పత్రికలలోనే వస్తున్నాయి.
మేము చెప్పేది కాదు.
2014అధికారంలో ఉనప్పుడు మండలాల వారిగా దోసుకొని తిన్నట్టు అవటం లేదని మీ కడుపు మంట.ఇప్పుడు గిడ్డి ఈశ్వరి నాయకత్వంలో గ్రామ స్థాయి కార్యకర్తలు మహిళలు ఆధ్వర్యంలో కొయ్యూరు మండలం ప్రశాంతంగా పని చేస్తున్నారు అని అన్నారు.
ఈ కార్యక్రమంలో
మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, క్లస్టర్ ఇంచార్జ్ బోనంగి సత్యవతి,
బంటు లక్ష్మణ్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు, కోకాస్టర్ పాడి వెంకటేష్,
చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బండారు సాంబమూర్తి,కినిబెరి వరలక్ష్మి,తోకల దేవి, దారకొండ నారాయణమూర్తి,మాజీ సర్పంచ్ లింగేటి శంకర్రావు, మాజీ సర్పంచ్ కుని శెట్టి చంద్రరావు, మాజీ సర్పంచ్ బంటు లక్ష్మయ్య,మాజీ ఎంపీటీసీ కసవరాజు, అచ్చయ్య నాయుడు మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్, సుంకరి బాలకృష్ణ యూనిట్ ఇంచార్జ్ లోతా సింహాచలం యూనిట్ ఇంచార్జ్ గాలి చిన్నారావు యూనిట్ ఇంచార్జ్ కుని శెట్టి సత్తిబాబు యూనిట్ ఇంచార్జ్ కూడా సతీష్ గ్రామ కమిటీ అధ్యక్షుడు. కుమార్పు లావరాజు గ్రామ కమిటీ అధ్యక్షులు. లింగేటి సోంబాబు గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి పొట్టిగా అర్జున్ గ్రామ కమిటీ అధ్యక్షుడు. పల్లి అప్పారావు గ్రామ కమిటీ అధ్యక్షులు. పొట్టిగా సింహాచలం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి. చెక్క చంటిబాబు మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి. బొందుల రమేష్ ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి. మాతే రాధాకృష్ణ గ్రామ కమిటీ అధ్యక్షులు. గాం చిన్నబ్బాయి గ్రామ కమిటీ అధ్యక్షులు. వార కొండలరావు బూత్ కన్వీనర్. కారెం శ్రీ సత్య బూత్ కన్వీనర్. పాంగి భీమరాజు బూత్ కన్వీనర్. కూడా కృష్ణ గ్రామ కమిటీ అధ్యక్షుడు. తూబెరి కృష్ణ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సీనియర్ కార్యకర్తలు రొబ్బసింగి చిన్న. ఏం పాటి అప్పారావు. పంద్ర బంగారం. కోమారపు చిన్న చిరంజీవి తెలుగు యువత కార్యదర్శి. మరియు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు

# మహిళల భద్రతకు పోలీసుల భరోసా





**గోకవరంలో ఉత్సాహంగా 'ఉమెన్స్ సేఫ్టీ అవేర్నెస్' సైకిల్ ర్యాలీ**
**- స్వయంగా సైకిల్ తొక్కి ఆదర్శంగా నిలిచిన నార్త్ జోన్ డీఎస్పీ జీవన**
**- ఆపదలో ఉంటే '112'కు కాల్ చేయండి: డీఎస్పీ**

గోకవరం. జన సముద్రం న్యూస్ జూలై 31.

మహిళల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని నార్త్ జోన్ డీఎస్పీ జీవన స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో మహిళా భద్రతపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక గోకవరం హైస్కూల్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విద్యార్థులతో కలిసి పోలీసులు భారీ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో డీఎస్పీ జీవన స్వయంగా సైకిల్ తొక్కిఅందరినీఆశ్చర్యపరచడంతో పాటు, విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవనతో పాటు కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ మూర్తి, గోకవరం సబ్ ఇన్స్పెక్టర్ బి.ఎన్.వి. పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీ అనంతరం గోకవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, ఆకతాయిల వల్ల ప్రమాదం అనిపించినా ఏమాత్రం భయపడకుండా వెంటనే 112 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థి దశలో ఉన్న బాలికలు సెల్‌ఫోన్లకు వీలైనంత దూరంగా ఉంటూ, చదువుపైనే ప్రధాన దృష్టి సారించాలని డీఎస్పీ హితవు పలికారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, అటువంటి వాటికి దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం మార్గరేట సుచరిత, ఉపాధ్యాయులు, ప్రయాణికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# జనసేన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

నరసాపురం జులై 31 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్





నరసాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ అధ్యక్షతన జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై చర్చించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ విజయానికి కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ఆయన చూపిన మార్గంలో పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేర్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని, సేవా దృక్పథంతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళికృష్ణ (చిన్న), జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వర రావు, జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, బూత్ కమిటీ అధ్యక్షులు జక్కం బాబ్జీ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ వలవల నాని, ఏఎంసి వైస్ చైర్మన్ దేశినీడి గంగాధర్, జిల్లా డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ గుబ్బల మార్రాజు, బందెల రవీంద్ర, బళ్ళ వెంకటేశ్వర్లు, వాతాడి కనకరాజు, చాగంటి పార్థసారథి, కొల్లాటి గోపికృష్ణ, నిప్పులేటి తారక రామారావు, గంటా కృష్ణ, దొండపాటి స్వాములు, జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి..





**37 ఏళ్ల నిస్వార్థ సేవల తర్వాత పదవి విరమణ పొందిన ఏఈవో దుర్గారావు.**

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 31 ద్వారకాతిరుమల ప్రతినిధి.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సుమారు 37 సంవత్సరాల పాటు నిస్వార్థ సేవలను అందించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మెట్టపల్లి దుర్గారావు శుక్రవారం పదవి విరమణ పొందారు. ద్వారకాతిరుమల కొండపైన శ్రీ వైజయంతి ఫంక్షన్ హాల్లో పదవి విరమణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఎస్వి సుధాకర్ రావు, అనువంశిక ధర్మకర్త నివృత్తి రావు,ఈవో వి.త్రినాధరావు, ఈ ఈ డివి. భాస్కర్, డిఇవో వై. భద్రాజి,ఏఈవో పి.నటరాజురావు, ఐ .రమణరాజు, ఎం ఎస్ ఎల్ శ్రీనివాస్, ఉమాపతి, సూపర్నెంట్లు జి. సుబ్రమణ్యం, ఐ.వి రామారావు, కే .వి.దుర్గాప్రసాద్, నగేష్, డిఈ టి .సూర్యనారాయణ , హనుమంతుచార్యులు ట్రస్ట్ బోర్డు సభ్యులు కంపసాటి నాగ సీత , రామకృష్ణ, కే ఎన్ ఎల్ రాజు సిబ్బంది మరియు స్థానికులు ఆయనను ఘనంగా సత్కరించారు.స్థానికులైన శ్రీ మెట్టపల్లి దుర్గారావు సుమారు నాలుగు దశాబ్దాల పాటు శ్రీవారి ఆలయంలో వివిధ హోదాల్లో, పలు శాఖల్లో బాధ్యతలు నిర్వర్తించారు. తన ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణకు, అంకితభావానికి మారుపేరుగా నిలిచిన ఆయన, చివరిగా ఏఈవో కేటగిరీలో పదవి విరమణ పొందడం విశేషం. స్వామి వారి సేవలో ఆయన చూపిన భక్తిశ్రద్ధలు, అందించిన సేవలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని సహచర ఉద్యోగులు కొనియాడారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీ మెట్టపల్లి దుర్గారావు, ఆయన సతీమణి దంపతులను ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ శాఖల సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. వారి పదవి విరమణ జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు దేవస్థాన అధికారులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గారావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గోదావరి ఉధృతి - మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ నాగమణి

తూర్పుగోదావరి/ సీతానగరం/ జూలై 31/ జనసముద్రం న్యూస్ :



ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నది తీవ్రంగా ప్రవహిస్తోందని, మండల ప్రజలు, ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంత వాసులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సీతానగరం ఇంచార్జ్ ఎస్ఐ నాగమణి కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక ప్రజలను ఉద్దేశించి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మునికూడలి ఘాటు వద్ద పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఎవరూ నదిలోకి దిగవద్దని, చేపల వేటకు లేదా ఈతకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించాలని, అలాగే చిన్నారులు, మూగజీవాలను నదీ తీర ప్రాంతాలకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే పోలీసులకు లేదా స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించాలని, ఈ సందర్భంగా ఎస్ఐ నాగమణి మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ చిన్న వెంకన్న సన్నిధిలో మెట్టపల్లి పదవీ విరమణ అభినందనీయం

**గడ్డమణుగు రవికుమార్**

జన సముద్రం న్యూస్ పోలవరం ప్రతినిధి , జూలై 31,



శ్రీ ద్వారకాతిరుమల చిన్న వెంకన్న దేవస్థానంలో సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈఓ)గా 37 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన మెట్టపల్లి దుర్గారావు పదవీ విరమణ పొందడం అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ, ద్వారకాతిరుమల దేవస్థానం ధర్మకర్త మండలి ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ అన్నారు.
శుక్రవారం ఆలయ చైర్మన్ ఎస్.వి. సుధాకరరావు అధ్యక్షతన శ్రీ చిన్న వెంకన్న సన్నిధిలో ఘనంగా నిర్వహించిన పదవీ విరమణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాధారణ ఉద్యోగిగా దేవస్థానంలో సేవలను ప్రారంభించిన మెట్టపల్లి దుర్గారావు తన అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో ఒక్కో మెట్టు ఎదుగుతూ సహాయ కార్యనిర్వహణాధికారి స్థాయికి చేరుకోవడం విశేషమని కొనియాడారు. భక్తులకు సేవ చేయడాన్ని ఆయన తన ధ్యేయంగా భావించి విధులు నిర్వర్తించారని, స్వామివారి సన్నిధిలో సుదీర్ఘకాలం సేవ చేసే అవకాశం లభించడం ఆయన చేసుకున్న పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు.
పదవీ విరమణతో ప్రభుత్వ సేవ ముగిసినప్పటికీ, ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం ఆయన అనుభవాన్ని దేవస్థానం స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని రవికుమార్ సూచించారు. ఆలయ పరిపాలనలో దుర్గారావు అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని అన్నారు.
ఈ సందర్భంగా మెట్టపల్లి దుర్గారావు దంపతులను ఘనంగా సన్మానించి, వారు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఆత్మీయ సన్మానం

నెల్లూరు, జులై 31, జనసముద్ర ం సముద్రం జిల్లా ప్రతినిధి



అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఆత్మీయ సన్మానం నిర్వహించినట్లు సర్వేపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ అలీముత్తు శుక్రవారంతెలిపారు. ఈ సందర్భంగా సాలువాకప్పి సన్మానించి అభిమానం చాటుకున్నారు. పేదల సమస్యలను అధికార ప్రతినిధి షేక్ ఎమ్మెల్యే సోమిరెడ్డికి తెలియజేయగా సానుకూలంగా స్పందించారు.

# కీటక జనిత వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన







**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూలై 31:**
ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మంటపంపల్లి పెన్నా హైస్కూల్ నందు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భావన, కరస్పాండెంట్ రామయ్య, ప్రిన్సిపల్ దాక్షాయణి అధ్వర్యంలో "డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు" పురస్కరించుకొని సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు కీటక జనిత వ్యాధుల గురించి విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతు ప్రతి ఒక కుటుంబము చెక్,క్లీన్,కవర్ పాటించాలని తెలియపరిచారు. అలాగనే ప్రతిఒక్కరు దోమతెరలలోనే నిద్రించాలనితెలియపరిచారు. డాక్టర్భావనమాట్లాడుతు 14 సంవత్సరాలు పూర్తి చేసుకొని 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న అమ్మాయిలందరు హెచ్ పివి వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలియజేశారు. సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతు ఆగస్టు 3నుండి 8 వరకు జరగబోవు డిపిటి,టిడి వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ సందర్భంగా 5,10,16 సంవత్సరాల పిల్లలు వ్యాక్సిన్ వేపించుకోవాలని తెలియ జేశారు. అనంతరం మంటపంపల్లి గ్రామంలో డ్రైడే,ఫ్రైడే కార్యక్రమం నిర్వహించదంజరిగినది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందము, ఎం ఎల్ హెచ్ పి చంద్రిక,స్త్రీ ఆరోగ్య కార్యకర్త సరోజ ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# అన్నీవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం..!
## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జూలై 31**
అన్నీవర్గాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని 10,11,19,22 వార్డుల నందు కూటమి పార్టీల శ్రేణులు తలపెట్టిన ఇంటింటికీ తెలుగుదేశం.. ప్రతి ఇంటికి జూలకంటి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వార్డులోని మహిళలు హారతులు పట్టగా.., ప్రజలు, శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ప్రతి ఇంటికీ తిరిగి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో సాధించిన ప్రగతి వివరాల కర పత్రాలను అందించుకుంటూ ప్రచారంలో ముందుకు సాగారు. వార్డులో జరిగిన అభివృద్ధిని, పంచిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలానే స్థానికంగా ఉన్న సమస్యలనుఅడిగితెలుసుకుని,వాటినిపరిష్కరించవల్సింది గా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, హౌసింగ్ ఏఈ మరియదాసు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవ రెడ్డి, కజ్జం సైదయ్య, మంజుల వెంకటేశ్వర్లు, వజ్రం నాయక్, బండ్ల బ్రహ్మాం, రెడ్యా నాయక్, శాంతి, దుర్గా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గర్వం ప్రపంచానికి పరిచయం దింసా
## నృత్యంతో ఆకట్టుకున్న కూటమి ప్రభుత్వం



**అనంతగిరి,జనసముద్రం న్యూస్ జూలై 31:**
ఆంధ్రప్రదేశ్ గిరిజనుల గొప్ప సాంస్కృతిక వారసత్వమైన దింసా నృత్యాన్ని ప్రపంచ వేదికపై పరిచయం చేస్తూ కూటమి ప్రభుత్వం మరో విశిష్ట ఘట్టానికి శ్రీకారం చుట్టింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా వేలాది మంది గిరిజన విద్యార్థులు, కళాకారులు సంప్రదాయ దుస్తుల్లో దింసా నృత్యాన్ని ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

తరతరాలుగా ఆదివాసీ సమాజం సంరక్షిస్తూ వస్తున్న దింసా నృత్యం కేవలం ఒక కళారూపమే కాదు, గిరిజనుల ఐక్యత, సంస్కృతి, జీవన విధానం మరియు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రదర్శన ద్వారా గిరిజన సంస్కృతి విశిష్టత దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచ దృష్టిని కూడా ఆకర్షించింది.

గిరిజన కళలు, సంస్కృతికి ప్రాధాన్యం ఇస్తూ వాటికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివాసీ కళాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

"మన సంస్కృతి మన గౌరవం, దింసా నృత్యం ప్రపంచానికి మన గుర్తింపు" అనే భావనను చాటిచెప్పిన ఈ వేడుక గిరిజన సంస్కృతి వైభవాన్ని మరోసారి ప్రపంచానికి పరిచయం చేసిన చారిత్రక సందర్భంగా నిలిచింది.

# పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ మస్తానయ్య ను ఘనంగా సన్మానించిన జిల్లా
## ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారు..

**జన సముద్రం న్యూస్, మదనపల్లి, జులై 31:**
లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ (1155)గా విధులు నిర్వహిస్తూ 33 ఏళ్ల సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ పొందిన సి. మస్తానయ్యకు జిల్లా పోలీసు శాఖ శుక్రవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికింది. మదనపల్లెలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ,. గారు ముఖ్య అతిథిగా హాజరై, మస్తానయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. ఒత్తిడితో కూడిన పోలీసు వృత్తిలో ఇన్నేళ్ల పాటు అంకితభావంతో, క్రమశిక్షణతో ప్రజలకు విశేష సేవలందించడం అభినందనీయమన్నారు. ఆయన తదుపరి జీవితం ఆయురారోగ్యాలతో, సంతోషంగా సాగాలని ఆకాంక్షిస్తూ, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ సత్వరమే అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. తనను ఆత్మీయంగా సత్కరించిన



ఎస్పీ గారికి ఏఎస్ఐ మస్తానయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి గారు, ఏఆర్ డీఎస్పీ డి.ఏడుకొండల రెడ్డి గారు, ఆర్ఐ రవికుమార్ గారు, ఇతర అధికారులు, సిబ్బంది ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైసీపీ రౌడీయిజాన్ని క్షమించను..!

- దోషులను కఠినంగా శిక్షించాలి..!
- ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం..





**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జులై 31**
కూటమి ప్రభుత్వంలో వైసీపీ రౌడీయిజాన్ని క్షమించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని విజయపురిసౌత్ లోని దేశవరపుతండాలో వైసీపీ హయంలో జరిగిన డ్వాక్వా మోసాన్ని ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 9 మంది గాయపడగా.., ఇరువురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. , మరికొందర్ని స్థానిక ప్రభుత్వాసుపత్రి నందు చికిత్స తీసుకుంటున్నారని తెలుసుకుని, బాధితులను శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించారు. అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., మహిళ పొదుపు సంఘాల ద్వారా గ్రూపులోని సభ్యులకు తెలియకుండా కోటి రూపాయలకు పైగా రుణాలు ఫ్రాడ్ చేసి తీసుకున్నారని విచారణ తెలగా.., బాధిత మహిళల్లో టీడీపీ సానుభూతిపరులు వారిని నిలదీయగా.., పాశవికంగా దాడికి పాల్పడ్డారని చెప్పుకొచ్చారు. వైసీపీ దొంగల్ని ప్రశ్నించారనే నేపంతో కక్ష కట్టి దాడికి వడికట్టారని, ఇది సరైనా విధానం కాదని తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రెండు దశాబ్దాలుగా సాగిస్తున్న గూండాయిజానికి రోజులు చెల్లాయని.., టీడీపీ కార్యకర్తలపై అన్యాయంగా దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు .. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రి నందు ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను సూపరింటెండెంట్ మహేష్ ను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసన్, ఫిజిషియన్, జనరల్ సర్జన్ వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఎంఎన్వో పోస్టులు ఆసుపత్రి నందు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.., స్పందించిన ఎమ్మెల్యే ఫోన్ ద్వారా సిబ్బందిని కేటాయించాలని ఉన్నతాధికారును కోరారు. అలానే ఏపీఎంఐడీసీ ద్వారా పెండింగ్ లో వర్క్స్, రావాల్సిన నిధులను పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు, బోయ గోపిరెడ్డి, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, బొబ్బిలి చంద్రశేఖర్, రాహుల్, సత్యబాబు, సిహెచ్ అప్పలరాజు, షేక్ మస్తాన్, గంట ధనుంజయరావు, నరసింహులు, దేవుడు, రావుల శ్రీను, పవన్, బన్ను, రాజేష్, పండు, కోదండం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో
## అందుబాటులో ఉంది ఎస్. నిసార్ అహ్మద్



**జనసముద్రం న్యూస్, మదనపల్లి, జూలై 31:-**
జిల్లా కేంద్రం మదనపల్లె కలెక్టరేట్‌లో నేడు నిర్వహించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ముసాయిదా ఓటర్ల జాబితాను పెన్ డ్రైవ్ రూపంలో అందజేసింది.

ఈ సమావేశంలో మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎస్. నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకుల బృందం ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారుల నుంచి స్వీకరించింది.

ఈ సందర్భంగా ఎస్. నిసార్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా ముసాయిదా ఓటర్ల జాబితాను మదనపల్లె పట్టణంలోని అవెన్యూ రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని తెలిపారు.

ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, వివరాల్లో తప్పులు ఉండటం, చిరునామా మార్పు, ఇతర సందేహాలు లేదా అభ్యంతరాలు ఉన్న వారు వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని గానీ బి ఎల్ ఏ లను గానీ సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగిన సూచనలు, సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. రెడ్డి, మైనారిటీ విభాగం నాయకుడు గుండ్లూరు రఫీక్, పట్టణ బూత్ కమిటీ అధ్యక్షుడు ఎన్. నవాజ్ ఆలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఒక్కరోజు 73 ఫిర్యాదులు స్వీకరణ







- ప్రజల నుండి స్వీకరించిన ప్రతి అర్జీకి అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి
- నిబంధనలకు లోబడి సమస్యలను వేగంగా పరిష్కరించాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ

**నరసాపురం జులై 31**
**జనసముద్రం జిల్లా ప్రతినిధి ధనుంజయ్**
నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నరసాపురం నియోజకవర్గ స్థాయి మొదట విడత ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ప్రత్యేక కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, ఆర్డీవో దాసిరాజు సంయుక్తంగా పాల్గొని, ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమానికి పాల్గొన్న అధికారులందరూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ ఒక్క రోజు 73 అర్జీలను స్వీకరించడం జరిగిందని వాటిలో లో చిన్న చిన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. డ్రైనేజీ ఇరిగేషన్ ఆక్రమణలు వంటి సమస్యలను పరిష్కారమునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించి ప్రజలకు మరింత చెరువు కావాలని అన్నారు. పరిష్కారం కాని సమస్యలపై అర్జీదారుల కు సరైన కారణాలను వివరించాలని అన్నారు. ఇప్పటివరకు 6,975 స్వీకరించగా 5,733 సమస్యలను పరిష్కరించడం జరిగిందని అన్నారు. ప్రతి అర్జీకి అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని నిబంధనకు లోబడి సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.

ప్రత్యేక ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీకి అధికారులు నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మరో మూడు పర్యాయములు నిర్వహించటం జరుగుతుందని ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామ సమస్యలు అర్జీలు సమర్పిస్తే అధికారులు అధికారులు వాటికి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

నేడు స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ఉన్నాయి లినరసాపురం మున్సిపాలిటీ 9వ వార్డు నుండి ఇంటి స్థలం ఇప్పించాలని తిరుమణి కనకదుర్గ కోరారు. నరసాపురం మెయిన్ కెనాల్ వేములదీవి పంట కాలువల లోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని నరసాపురం నుండి పి. పూర్ణ, జల్లి రామ్మోహన్ కోరారు. నరసాపురం రుస్తుంబాధ నత్త లావా మురుగు కాలవలు ఆక్రమణలకు గురి అయ్యి సుమారు 650 ఎకరాలు



పంట భూమి మునకకు గురై ,నాట్లు వేయడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే ఆక్రమణలు తొలగించి కాలువలు ఆధునీకరణ చేయాలని మండలంలో ఎర్రం శెట్టి వారి పాలెం నుండి కునపరెడ్డి వీర వెంకట విజయ రామారావు కోరారు. 40 సంవత్సరములు క్రితం వేసిన పైపులైన్లు పాడైపోయి త్రాగునీరు కలుషితమైపోతుందని వెంటనే చర్యలు తీసుకుని కొత్త పైపులైన్లు వేసి డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని నరసాపురం మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ, పి వెంకటేశ్వరరావు గ్రామస్తులు కోరారు.

నరసాపురం మండలం ఎల్ బి చర్ల గ్రామం నుండి 39 సంవత్సరముల గుత్తుల రాజేశ్వరి మానసిక వికలాంగురాలైన తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి జి ఆర్ ఎస్ జిల్లా ప్రత్యేక అధికారి వై దోసిరెడ్డి, నియోజకవర్గం ప్రత్యేక అధికారి పి. వీరభద్రరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్ రామిరెడ్డి, నరసాపురం తహసిల్దార్ నాగార్జున, వివిధ శాఖల జిల్లా ,డివిజన్, మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారం లోపం జరిగితే సహించను..!

## సాగర్ గురుకులంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు..!





**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జూలై 31**

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాహారం లోపం తలెత్తితే నిర్లక్ష్యం వహిస్తే సహించను అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా పాఠశాలలోని ఉపాధ్యాయులు విధుల రిజిస్టర్ ను తనిఖీ చేసి.., విధులకు గైహాజరైన వారి వివరాలను వైస్ ప్రిన్సిపల్ జరీనా బేగంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడున్న వంటశాలను తనిఖీ చేశారు. ఆహార పదార్ధాలను స్వయంగా రుచి చూసి.., సాంబర్, బంగాళాదుంప కూరల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెను ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని వార్డెన్ లక్ష్మికి సూచించారు. ఈ సారి మళ్లీ వచ్చే సరికి అన్నీ మారాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కూటమి పార్టీల శ్రేణులు, అధికారులు ఉన్నారు.

# నడివీది ముత్యాలమ్మ అమ్మవారికి ఆషాడం సారె

## ఆదివారం ఉదయం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

**మొగల్తూరు జులై 31 జనసముద్రం**

నడివీది శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించే ఆషాడం సారె సమర్పణ కార్యక్రమం ఆదివారం ఉదయం 9 గంటలకు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజల్లో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహిస్తేకుటుంబాలకు ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం,సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసమన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు సమయానికి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.




# స్థాయి పెరిగినా మూలాలు మరవకూడదు..!

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జూలై 31**

మనిషి స్థాయి పెరిగినా వచ్చిన మూలాలను మరవకూడదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీఆర్డీసీ ప్రిన్సిపల్ గుత్తికొండ వెంకటరామిరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., ప్రభుత్వ విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనకడుగు ఉండదని చెప్పారు. నిరాడబరంగా వెంకటరామిరెడ్డి విధులు సాఫీగా సాగాయని, ఇకమీదట కూడా ఆనందకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకటరామిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు, బోయ గోపిరెడ్డి, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, బొబ్బిలి చంద్రశేఖర్, రాహుల్, సత్యబాబు, సిహెచ్ అప్పలరాజు, షేక్ మస్తాన్, గంట ధనుంజయరావు, నరసింహులు, దేవుడు, రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్





**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూలై 31:**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయి తెలుగుదేశం పార్టీ నాయకులు రోశయ్య అన్నారు

ఒంటిమిట్ట మండల పరిధిలోని ఇంటింటికి తెలుగుదేశం డోర్ టు డోర్() అన్ని గ్రామాల్లో పాల్గొనడం జరిగింది..

కొత్త మాధవరం మరియు రైల్వే కాలనీ పంచాయతీలోని బూత్ నెంబర్ 50,52,53,54 55 లో శుక్రవారం పర్యటిస్తూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 50, 52,53,54 55 బూత్ ఇంచార్జ్‌రోశయ్య, గఫూర్,సుబ్బారెడ్డి,నాగార్జున,సుబ్బయ్య ఆధ్వర్యంలో పాల్గొనడం జరిగింది .. రోశయ్యమాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని,సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపాను.. అమరావతి రాజధాని, పోలవరం పనులు పూర్తి కావొస్తున్నాయని తెలిపాను..

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు అందజేయాలన్నదే సీఎంచంద్రబాబు లక్ష్మమని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంపు, అన్న క్యాంటీన్లు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, తల్లికి వందనం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా ..ఇలా ఎన్నో పథకాలను కేవలం రెండేళ్ల కాలంలోనే అమలు చేశామని తెలిపాను..

మైనార్టీ నాయకుడు గఫూర్ మాట్లాడుతూత్వరలో నూతన పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ,చేనేతలకు ఉచిత విద్యుత్ ఇప్పటికే అందిస్తున్నామని, వచ్చే నెల ఏడో తేదీ నుంచి నేతన్న సేవలో పథకం పేరుతో ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపాను. ఈకార్యక్రమంలోరోశయ్య,గఫూర్, సుబ్బారెడ్డి,నాగార్జున,సుబ్బయ్యగ్రామస్తులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీలో జరిగిన అక్రమాలను సీబీఐ ద్వారా విచారణ జరిపించాలి

- నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న యువత....
- మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి....



**జనసముద్రం న్యూస్, మదనపల్లి, జూలై 31:-**

గత డీఎస్సీలో జరిగిన క్రమాలపై మరియు వస్తున్న ఆరోపణలపై సిబిఐ ద్వారా విచారణ జరిపించాలని తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని మదనపల్లె జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందించిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైయస్సార్ సిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె వైసిపి ఇన్ ఛార్జ్ నిస్సార్ అహమ్మద్.

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ

డీఎస్సీలో అభ్యర్థులకు అన్యాయం జరిగింది, స్పోర్ట్స్ కోటా పేరుతో ఉద్యోగాలు కావలసిన వారికి ఇచ్చుకున్నారు, అది కూడా యూనివర్సిటీ, కాలేజీ స్థాయిలో ఆడిన వారికి ప్రాధాన్యత ఇచ్చారు, జాతీయ స్థాయిలో ఆడిన వారిని పక్కన పెట్టారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అని చెప్పి కేవలం 16 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు, మొత్తం 3 లక్షల మంది అభ్యర్థులు హాజరైన పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శలు గుప్పించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ఏకంగా 1.25 లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకాలు చేపట్టాం అని, ఇందుకోసం ఏకంగా 26 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారని, ఎక్కడ ఒక చిన్న విమర్శకు మేము తావు ఇవ్వలేదు. ఎంతో పకడ్బందీగా ఆ నియామక ప్రక్రియ పూర్తి చేశాం అని గుర్తు చేశారు. విద్య రంగం, వైద్య రంగంలో అనేక వేల మందికి ఉద్యోగాలు కల్పించాం, ఈరోజు యువతను, నిరుద్యోగులను, మహిళలను ఈ ప్రభుత్వం మోసం చేసిందని, నిరుద్యోగ భృతి ఇస్తాం అని చెప్పి ఎన్నికల్లో గెలిచారు. ఇప్పటికీ ఆ ఊసు లేదని విమర్శించారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్మెంట్ ప్రవేశ పెట్టి అనేక మంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారని, ఈరోజు అనేక మంది ఇంజనీరింగ్ చదువులు చదువుకుని ఫారిన్ లో సెటిల్ అయ్యారని అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేశారు,ప్రతి పేద విద్యార్థి గొప్పగా ఎదగాలని ఇంగ్లీష్ మీడియం ను ప్రవేశ పెడితే, దానిని అడ్డుకున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే ఇంగ్లీష్ మీడియంను తీసేశారని ఆరోపించారు. పేదల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 17 మెడికల్ కాలేజీలకు ఏకకాలంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుమతులు తెచ్చారని, వాటిని ప్రవేటీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తుందని విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల పై నైతిక బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ గోల్ మాల్ పై చంద్రబాబు సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డిపై సీబీఐ విచారణకు చంద్రబాబునాయుడు డిమాండ్ చేస్తే, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా విచారణకు సిద్ధం అన్నారు. కానీ చంద్రబాబు మాత్రం సీబీఐ విచారణకు బయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంకు ప్రతిపక్షాలపై కేసులు పెట్టడంలో ఉన్న శ్రద్ధ ప్రజా పాలన పై లేదని, పోలీసులను అడ్డుపెట్టుకుని పాలించే స్థాయికి చంద్రబాబు దిగజారారని విమర్శించారు.

# రైల్వేకోడూరులో ఆల్ పార్టీ సమావేశం..!

## ఓటర్ల జాబితా, బూత్‌ల మార్పులపై వైఎస్సార్‌సీపీ తరపున పాల్గొన్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి..!!

**తిరుపతి జిల్లా ఇన్చార్జ్ న్యూస్ జూలై 31 జనసముద్రం న్యూస్**

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇవాళ నియోజకవర్గ స్థాయి ఆల్ పార్టీ (అఖిలపక్ష) సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి మరియు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సి.హెచ్. రమేశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈ ఆర్ ఓ అధికారి శోభన్ బాబు గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.

సమావేశం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీతో ప్రత్యేక సర్వే పూర్తవుతున్నందున, వచ్చే నెల నుంచి ముసాయిదా ప్రచురణ ప్రక్రియ ప్రారంభమవుతుందని సూచించారు.స్థానిక ఓటర్ల సౌకర్యం: ప్రతి పంచాయతీ పరిధిలోని ఓటర్లకు, వారు నివసించే ఊరిలోనే ఓటు హక్కు కల్పించేలా బూత్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఒక ఊరి ఓటర్లను వేరే బూత్‌కు మార్చడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. (ఉదాహరణకు 15వ నంబర్ బూత్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు). ధర్మపురం ప్రాంతానికి చెందిన బూత్‌ను ఎంఆర్‌ఓ కార్యాలయం వెనుక భాగానికి మార్చినందున, రైల్వేకోడూరు టౌన్ కి సమీపంలో ఉన్న పాఠశాల వద్దకే ఆ బూత్‌ను పునర్నిర్మించి సౌకర్యం కల్పించాలని కోరారు. నియోజకవర్గంలో నమోదైన 26,046 ఆబ్సెంట్, షిఫ్ట్, మరణాలు ఓటర్ల వివరాలను బూత్ వారీగా మరియు ~~యాణ జాబితా క్లియర్ వివరాలను సమర్పించాలని కోరారు.








# పేదల సేవలో భాగంగా డౌనూరులో ఇంటింటికీ "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్

## పంపిణీలో పాల్గొన్న ఎం.వి.వి. ప్రసాద్



**జిల్లా ఇంచార్జి జనసముద్రం న్యూస్ తేది జూలై 31**

అల్లూరి జిల్లా కొయ్యురు "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ కొయ్యూరు మండలం డౌనూరు గ్రామంలో నెలవారీ "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గ్రామస్తులకు వివరించారు.

ఈ సందర్భంగా ఎం.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ, పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా నిరంతరం కృషి చేయడం ప్రతి ప్రజాప్రతినిధి, పార్టీ నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, ఎక్స్ సర్పంచ్ రామకృష్ణ ఎక్స్ డైరెక్టర్ శ్రీరాములు ప్రసాద్ చలపతి వరహాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం.

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 31**
**గోపాలపురం .**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న చారిత్రాత్మక భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, శుక్రవారం సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ఉన్నత అధికారులు మరియు రాష్ట్ర ముఖ్య నాయకులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ ప్రారంభోత్సవ వేదిక, అతిథుల గ్యాలరీలు, భద్రతా ఏర్పాట్లు, మరియు



ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి జరుగుతున్న పనులను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి చిన్న లోపాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యేతో పాటు ద్వారక తిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు కూడా పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు.

## పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎం ఈఓ ఇందిరాప్రసాద్.

## ప్రత్యేక అవసరాలపిల్లలకు ఉపకరణాల పంపిణీ.



**జన సముద్రం న్యూస్ , జులై 31పుల్లల చెరువు,.**

పుల్లల చెరువు మండలం లోని ప్రత్యేక అవసరాలు కలిగిన (సి డబ్ల్యు ఎస్ ఎన్ )పిల్లలకు ఉచిత సహాయక ఉప కర ణా లను స్థానిక భవిత కేంద్రంలో ఎం ఈఓ ఇందిరాప్రసాద్శుక్రవారం పంపిణీ చేశారు.ఈరోజు సందర్భంగా ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్ల ల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలు సంక్షేమ పథకాలను తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారుఅనంతరం భవిత కేంద్రంలో .నిర్వహిస్తున్న ఫిజియో తెరాఫి కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు అందుతున్న సేవలపై ఆమె ఆరా తీశారు.ఫి జియో తెరాపి సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఫిజియో తెరపి వైద్యాధికారి అంకారావు, ఐ ఈ ఆర్ పి రంజిత్, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ కొండలమ్మను దర్శించుకున్న జిల్లా ఏఈఎస్....



**జనసముద్రం న్యూస్ గుడివాడ**
**నియోజకవర్గంప్రతినిధిసుబ్రహ్మణ్యం.జులై.31.**

మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెంటెండెంట్ యు.సుబ్బారావుతో పాటు గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణశుక్రవారం దర్శించుకున్నారు. వారిని దేవస్థాన చైర్మన్ ఈడేవిష్ణు వెంకట మోహన్‌రావు(మోహన్) దుశ్శాలువాలతో సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు.

## రైల్వే కోడూరులో టీబీ నిర్ధారణ శిబిరం



**తిరుపతి జిల్లా ఇన్చార్జి న్యూస్ జూలై 31 జనసముద్రం న్యూస్**

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం రైల్వే కోడూర్ పట్టణం లోని 3వ సచివాలయం హెల్త్ క్లినిక్ సెంటర్లో టీబీ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు... టీబీ నిర్ధారణ మెడికల్ ఆఫీసర్ల సమక్షంలో గురువారం 113 మందికి టీబీ పరీక్షలు చేశారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారందరినీ పరీక్షించి నమూనాలు సేకరించారు.శుక్రవారం నాటికి 200 మందికి టీబీ టెస్టులు నిర్వహిస్తామని హెల్త్ సూపర్వైజర్ బాలకృష్ణ రాజు తెలిపారు... టీబీ లక్షణాలు ఉన్నవారు ఎవరైనా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ముందస్తు గుర్తింపు, చికిత్సతో టీబీని పూర్తిగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్వైజర్ ఆసియా, ఎంఎల్‌హెచ్‌పి నందిని, ఏఎన్‌ఎం సుధారాణి, ఆశ వర్కర్లు మౌనిక, రత్న, రూప తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర ఆలయంలో ముగిసిన వరుణ, రుద్ర హోమాలు.

## మూడో రోజు వైభవంగా రుద్ర హోమం, వరుణ హోమం, ఘట్టాభిషేకం.





**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 31**
**ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో వరుణ దేవుని అనుగ్రహం కోసం చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితులు పూర్తిగా తొలగిపోయి, ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలనే సదుద్దేశంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలు మూడో రోజుతో ముగింపునకు చేరాయి.

చివరి రోజైన శుక్రవారం నాడు ఆలయ పండితులు వేదమంత్రోచ్చారణలు, శాస్త్రోక్త పూజల నడుమ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసేలా వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు వరుణ హోమం, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ రుద్ర హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్వహించిన ఘట్టాభిషేకం విశేషంగా ఆకట్టుకుంది.మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో అర్చకులు, పండితులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా మారి, రైతన్నల ఆనందం వెల్లివిరిసేలా వరుణ దేవుడు కరుణించాలని భక్తులు స్వామివారిని వేడుకోవడంతో ఈ పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి.

## 12 వ రోజు కొనసాగిన లేఖరిల సమ్మె




**తూర్పుగోదావరి/ సీతానగరం/ జూలై 31/జనసముద్రం న్యూస్ :**

స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు లేఖరిల సమ్మె 12వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా లేఖరిల సంఘం మండల అధ్యక్షుడు మడిచర్ల వి ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద దస్తావేజు లేఖర్ల సమ్మె జూలై 23 నుంచి 12 రోజులుగా నిర్వహిస్తూ ఉన్నామని, ప్రభుత్వం పీపీపీ విధానంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో నెం.396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లేఖర్లు రాష్ట్రవ్యాప్తంగా 'పెన్ డౌన్' సమ్మె చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి స్థానికంగా ప్రజలు, రైతులు తమకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ చింతలూరి రమేష్, తిరుపతిరావు, కెవిఎస్ రాజు, ఆర్ నరేష్, డి సుబ్రహ్మణ్యం, ఎస్ లక్ష్మణరావు, కే రమణ రావు, ఆర్ ఆనందరావు, ఏ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## మొగల్తూరు చేపల మార్కెట్లో శానిటేషన్ కరువు

- పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- బాత్రూంల దుస్థితితో వ్యాపారులు వినియోగదారుల ఆవేదన







**మొగల్తూరు జూలై 31**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

మొగల్తూరు చేపల మార్కెట్లో శానిటేషన్ పూర్తిగా దెబ్బతిందని వ్యాపారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లోని మరుగుదొడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని, శుభ్రపరిచే పనులు సక్రమంగా జరగకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ అస్వచ్ఛ వాతావరణం నెలకొన్నట్లు వారు తెలిపారు. బాత్రూంలలో మురుగు పేరుకుపోవడం, గోడలపై తేమ, బూజు ఏర్పడడం, మరుగుదొడ్ల బయట మురుగునీరు నిల్వ ఉండడం వల్ల మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, చేపలు కొనుగోలు చేసే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. చేపల మార్కెట్ కి ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం సరికాదని వారు మండిపడ్డారు. డ్రైనేజీలో తొలగించిన వ్యర్థాలపై శానిటేషన్ ప్రక్రియ పూర్తిగా కనుమరుగైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు, మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచి, ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని వ్యాపారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## తర్లుపాడులో రైళ్ల నిలుపుదల పునరుద్ధరించాలి

## దక్షిణ కోస్తా రైల్వే జీఎంకు డా. షేక్ మహబూబ్ వలి వినతి



**తర్లుపాడు జూలై 31 (జన సముద్రం న్యూస్)**

తర్లుపాడు రైల్వే స్టేషన్‌కు విచ్చేసిన దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సందీప్ మాథూర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ షేక్ మహబూబ్ వలి కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం తర్లుపాడు, మార్కాపురం రోడ్డు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జీఎంకు వినతిపత్రం సమర్పించారు.

కోవిడ్-19కు ముందు తర్లుపాడు రైల్వే స్టేషన్‌లో ఉన్న రైళ్ల నిలుపుదలలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. మార్కాపురం రోడ్డు రైల్వే స్టేషన్‌లో అప్పర్ క్లాస్, స్లీపర్ క్లాస్ ప్రయాణికుల కోసం అధునాతన వెయిటింగ్ రూములను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే మార్కాపురం రోడ్డు స్టేషన్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లేందుకు వారానికి ఒకసారి రైలును ప్రవేశపెట్టాలని, రిజర్వేషన్ కౌంటర్‌ను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంచాలని కోరారు.

ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వినతిపత్రంలోని డిమాండ్లను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని డా. షేక్ మహబూబ్ వలి రైల్వే జీఎంను కోరారు.

## ప్రతి ఇంటికి కూటమి సంక్షేమ పథకాలు

## మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డిలి





**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జులై 31**

లక్కిరెడ్డిపల్లి మండలం కోనంపేట పంచాయతీ లోని బూత్ నెంబర్:8 లో తెలుగుదేశం పార్టీ రెండు సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమంపై అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి తనయుడు నిశ్చల్ నాగిరెడ్డి

ఆయన మాట్లాడుతూ కూటమి ఇప్పటికే శ్రీ శక్తి పతకం, గ్యాస్ ఉచిత సిలీశీడర్స్ , అవ్వ తాతలకు 4000, ఎన్నో గ్రామాలకు సీసీ రోడ్స్, వేయడం జరిగినది అని పేర్కొన్నారు

అదేవిధంగా తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి గురించి, యువత భవిష్యత్తు గురించి ఆలోచించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ గురించి ప్రజలకు, తెలుసుకోవాలని తెలియజేశాడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం వేసి మహిళలను ఆదుకోవడం జరుగుతోందని నిచ్చల్ నాగిరెడ్డి పేర్కొన్నాడు త్వరలో కొత్త పెన్షన్ లు మంజూరు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకోవడం జరుగుతుందని ఆయన తెలియజేయడం జరిగిందిలి ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ ,జడ్పిటిసి అంబాబత్తిన రెడ్డయ్య , మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి ,క్లస్టర్ కన్వీనర్ శంకారపు జయరాంగా,గంగమ్మ ఆలయ చైర్మన్ సోడి వెంకటేశ్వర్లు యాదవ్ , దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు ,క్లస్టర్ కో కన్వీనర్ బోనాల ధనుంజయ,మాజీ సర్పంచ్ లు లక్ష్మీనారాయణ,కేశవయ్య, సుబ్బయ్య, దీన్నెపాడు రవిరాజు,టిడిపినాయకులు

వెంకటనారాయణ,యూనిట్ ఇన్చార్జ్ బాలే పెద్ద రెడ్డయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ లు గంగయ్య, గోవిందు వెంకటేశు అబ్దుల్ రజాక్, నెంబర్ ఓబులేసు, యోగాంజీల్ రెడ్డి, సాంబ శివయ్య, వసంత్ కృష్ణమోహన్ రెడ్డి, పెండెం రామాంజనేయులు,మండ్ల

రామాంజనేయులు,యోగాంజనేయులు,ఆది రెడ్డయ్య, నాగ శేషు, కావలి అశీజనేయులు , రెడ్డప్ప రెడ్డి, కృష్ణ, చింతకుంటపల్లి బాబు, రిజ్వాన్, కిరణ్,టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో....

## అక్కా తమ్ముడికి ఆత్మీయ సన్మానం




**జనసముద్రం న్యూస్ అమడుగురు 31/07/2026**

మండలంలోని గాజులపల్లి గ్రామ సమీపంలో శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో శుక్రవారం ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి ఆధ్వర్యంలో జర్నలిస్టులు సంయుక్తంగా ఓడిచెరువు మండలంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు,పార్వతి దంపతుల కుమార్తె పచ్చార్ల హరిత,పచ్చార్ల జయమణికంఠ నాయుడు అక్కా తమ్ముళ్ళను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జూనియర్ కళాశాల,మోడల్ స్కూల్ కాలేజీ ప్రిన్సిపాల్స్ లక్ష్మీనరసింహ,కే.శిరీష బాయి ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ.... ఓడిచెరువు మండలం,తుమ్మలకుంట్లపల్లి గ్రామంలో అంగన్వాడీ బడి (పప్పుల పిండి బడి) నుండి ప్రాథమిక, జిల్లా ఉన్నత పాఠశాలలో చదివి, ఏపీఆర్జీసీ ఎంట్రన్స్ టెస్ట్ ఇంటర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో, పీజీ సెట్ ఎంట్రన్స్ టెస్ట్ ర్యాంకులు సాధించి కర్నూల్ రాయలసీమ యూనివర్సిటీలో ఎమ్మెసి ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ విద్య అభ్యసించిన పచ్చార్ల హరిత పట్టుదల,క్రమశిక్షణ నిదర్శనంగా నిలుస్తోందని కొనియాడారు.అదే బాటలో తమ్ముడు పచ్చార్ల జయమణికంఠ నాయుడు మండలంలోని మోడల్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదివి, ఏపీఆర్డీసి ఎంట్రన్స్ టెస్ట్ లో 119 ర్యాంక్ సాధించి, నాగార్జున విశ్వవిద్యాలయం అనుసంధానంగా ఏకైక నాగార్జున సాగర్ రెసిడెన్షియల్ బాయ్స్ విద్యాలయంలో ప్రవేశించడం అమడగూరు మండల కళాశాలకు శుభపరిణామన్నారు.ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ కనబరిచిన అక్కాతమ్ముళ్లను సత్కారిస్తున్న ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి మాట్లాడుతూ.... సమాజంలో విద్యతో గౌరవం పొందుతారన్నారు. హరిత,జయమణికంఠ ఇరువురు అక్కా తమ్ముళ్ళు ఎలాంటి ట్యూషన్లు,కోచింగులు లేకుండ ర్యాంకులు సాధించి ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించడం ఒకే కుటుంబంలో ఇరువురికి కల్పించడం అరుదుగా జరుగుతుందని, భవిష్యత్తులో అక్కాతమ్ముళ్ళు శుభ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయిలో గుర్తింపు పొంది ఆదర్శంగా వుండాలని ఆశాభావం వ్యక్తంచేశారు. సీనియర్ జర్నలిస్టు వార్త రమణ, మాట్లాడుతూ....సహచర పాత్రికేయులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు కుటుంబంలో ఇరువురు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత విద్యను అభ్యసించడం చాలా ఆనందంగా వుందన్నారు.అనంతరం ఉత్తప్ప సోమశేఖర హనుమంతు గంగాధర్ రామాంజనేయులు తదితర జర్నలిస్టులతో కలిసి మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణజ్యోతి ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన అక్కాతమ్ముళ్ళు(విద్యార్థులకు) ప్రిన్సిపాల్స్ లక్ష్మీనరసింహ,కే.శిరీష బాయి చేతుల మీదుగా పచ్చార్ల హరితక,పచ్చార్ల జయమణికంఠ నాయుడుకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు.

## ఎలక్టోరల్ విజ్ఞప్తి అమలు లోగా డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ పై పరిచయం సమావేశం. మాచర్ల తాసిల్దార్ కిరణ్ కుమార్



జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జులై 31

మాచర్ల నియోజకవర్గంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, పొలిటికల్ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి మరియు జాతీయ స్థాయి గుర్తింపున్న పార్టీల ప్రతినిధులు పూర్తి హాజరయ్యారు. సమీక్షకు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా కూడా పాల్గొన్నారు.

సమావేశంలో ప్రధానంగా ఎలక్షన్ కమిషన్ అందించిన సూచనలు, మరియు 31.07.2026 న పబ్లిష్ చేయబడనున్న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ప్రచురణ విధానంపై చర్చ జరగింది. ఎన్నికల ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద డ్రాఫ్ట్ వాటర్ లిస్ట్ ను కూడా పబ్లికేషన్ చేయడం అనంతరం ట్రాన్సురెన్సీ కోసం ఖచ్చితం చేయబడింది. అదనంగా, పోలిటికల్ పార్టీ ప్రతినిధులకు డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ యొక్క సాఫ్ట్ కాపీ ఇవ్వడం కూడా నిర్ణయఃకరంగా అమలు చేయబడినట్లు అధికారులు తెలిపారు.

అధికారుల ప్రకటనల ప్రకారం: డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌కు తగిన గుర్తింపులు, తప్పుల పరిశీలన కోసం పార్టీ ప్రతినిధుల పని సమయం కల్పించబడుతుంది.

ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు , నోటీసులు ద్వారా డ్రాఫ్ట్ లిస్ట్ ప్రజలకు అందుబాటులో ఉంచి సంబంధిత అభిప్రాయాలు స్వీకరించబడతాయి.

సాఫ్ట్ కాపీలు అందజేసినప్పటి నుండి పార్టీలకు అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్దిష్ట కాల వ్యవధిలో ఆవేదన నివేదికలు దాఖలు చేయవలసి ఉంటుందని

సమావేశం చివరలో అధికారులు ప్రజా హక్కుల పరిరక్షణకు, పెరిగిన పారదర్శకతకు, మరియు ఎన్నికల ప్రక్రియలో తప్పులనా గుర్తింపు, సవరణల కోసం ఈ చర్య అవసరమైనదని తెలిపారు. పార్టీ ప్రతినిధుల నుండి వచ్చిన సూచనలు రికార్డు చేయబడ్డాయి మరియు తీసుకోవలసిన తదుపరి చర్యలు సమీక్షకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు.





కుందుర్పి, జూలై 31,జన సముద్రం ( న్యూస్):

మండలంలోని మాలయనూరు గ్రామానికి చెందిన పేద దంపతులు తిమ్మక్క, కేంచరాయుడులు గత ప్రభుత్వ హయాంలో తమ పాత ఇంటిని తొలగించుకుని కొత్త ఇల్లు వస్తుందని ఆశతో ఆరుబయటే తాత్కాలికంగా గుడిసె కట్టుకుని జీవనం సాగించారు. వర్షాలు వచ్చినా, ఎండలు మండినా అదే గుడిసెలో నివసిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పందించారు.

గ్రామ సందర్శనలో భాగంగా ఆ దంపతుల పరిస్థితిని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే, వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ తన స్వంత ఖర్చులతో నూతన గృహ నిర్మాణాన్ని పూర్తి చేయించారు.

గురువారం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, అవసరమైన గృహోపకరణాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత. పేదల కష్టాలను దగ్గరగా చూసినప్పుడు మనసు కలచివేస్తుంది. తిమ్మక్క, కేంచరాయుడుల పరిస్థితి తెలుసుకుని వెంటనే సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. వారికి శాశ్వత నివాసం కల్పించడం నాకు ఆనందంగా ఉంది” అన్నారు.

గ్రామస్తులు మాట్లాడుతూ, పేదల పట్ల ఎమ్మెల్యే చూపుతున్న మానవత్వం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ సహాయం అందక ఎన్నో సంవత్సరాలు ఇబ్బందులు పడిన కుటుంబానికి స్వంత ఖర్చుతో ఇల్లు నిర్మించి ఇవ్వడం అరుదైన విషయం అని కొనియాడారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కొత్త ఇంటిలోకి ప్రవేశించిన తిమ్మక్క, కేంచరాయుడు దంపతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కంటి బాధితురాలు మంగమ్మకు లైన్స్ ప్రతినిధి రాంబాబు రూ 10 వేలు ఆర్థిక సహకారం అందజేత




మొగల్తూరు జూలై 31 జనసముద్రం ప్రతినిధి

మొగల్తూరు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొగల్తూరు గ్రామానికి చెందిన కంటి బాధితురాలు పాల మంగమ్మకు లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రతినిధి ఉండవల్లి రాంబాబు శుక్రవారం ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు మరియు కార్యదర్శి తణుకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భూపతిపాలెం ప్రాజెక్టును సూరంపాలెం ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని మంత్రికి వినతి



గోకవరం. జనసముద్ర న్యూస్ జులై 31.

సూరంపాలెం ప్రాజెక్ట్ రైతాంగానికి సమృద్ధిగా నీరు అందాలంటే భూపతిపాలెంప్రాజెక్టునుసూరంపాలెం ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు వినతిపత్రం అందించారు. వర్షాభావ పరిస్థితుల వలన సూరంపాలెం ప్రాజెక్టు వెలవెలబోతుందని, ప్రాజెక్ట్ నీటి నిల్వ మార్గాలను స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్వేషించడం జరిగిందన్నారు. భూపతిపాలెం ప్రాజెక్టు నుండి సూరంపాలెం ప్రాజెక్టుకు నీరు వచ్చే కాలుమార్గాలను ఆధునికరిస్తే నీరు గలగల పారుతుందని వారు తెలిపారు. ఏజెన్సీ రంపచోడవరం నియోజకవర్గం లోని కాలువ మార్గాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వయంగా వెళ్లి పరిశీలించాలని, సూరంపాలెం ప్రాజెక్ట్ ఆయకట్టుకు నీరు వచ్చే విధంగా కాలువలను ఆధునికరణ చేయడానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. వారితో పాటుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనపరెడ్డి బాబు, గోకవరం టిడిపి మండల కన్వీనర్ పిల్ల చంటిబాబు, నియోజవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు భూపాలపట్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క తొలిగింపు ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం జులై 31 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం నుంచి అనాకోడేరు వరకు సుమారు 7 కిలోమీటర్ల వరకు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలిగింపు ప్రక్రియను శనివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఎన్నో గ్రామాలను కలుపుకుని వెళ్లే ఈ కాలువకు పనులను త్వరితిగతిన పూర్తి చేయాలని, కాలువలో పెరిగిన గుర్రపు డెక్క తొలిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామాల రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు ,మహిళలు పాల్గొన్నారు.

## జౌకళ గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించండి.



జనసముద్రం న్యూస్

అమడగురు31/07/2026

విద్యార్థినీ విద్యార్థులకు అండగా నిలవండి. ప్రభుత్వ అధికారులను కోరిన మాజీ సింగల్ విండో డైరెక్టర్ మండల పరిధిలోని కొట్టువారిపల్లి పంచాయతీ జవగల గ్రామానికి చెందిన గత తుమ్మల మేజర్ పంచాయతీ సొసైటీ డైరెక్టర్ కొండాపురం అశ్వత్ నారాయణ మాట్లాడుతూ గతంలో కదిరి వయా బిల్లురూ ఏపీఎస్ఆర్టీసీ బస్సు ఆరు సార్లు వచ్చిపోతూ ఇటు ప్రయాణికులకు దివ్యాంగులకు వృద్ధులకు విద్యార్థులకు లగేజీలకు సకల సౌకర్యాలు కలిగేవని బస్సు లేని ఎడల ప్రస్తుతం వృద్ధులు విద్యార్థులు దివ్యాంగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కదిరి టు తుమ్మల అమడుగురు మీదుగా వస్తున్న కుంట్లపల్లి బస్సును అధికారులు చొరవ తీసుకొని జౌకళ గ్రామానికి పంపితే గ్రామంలో ఉన్న 500 మంది కుటుంబాలు రుణపడి ఉంటారని ముఖ్యంగా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుకుంటూ దాదాపు రాను మూడు కిలోమీటర్లు పోను మూడు కిలోమీటర్లు మొత్తం ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ దారి మధ్యలో ఇబ్బందులు గురవుతూ వస్తున్నారని వాటినీ గుర్తుపెట్టుకుని తమ తల్లిదండ్రులు బిడ్డలు ఎప్పుడు వస్తారో ఏం జరుగుతుందో అని భయాందోళనలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వ అధికారులు మరియు కదిరి డిపో మేనేజర్ వెంటనే గ్రామ స్తులు మరియు విద్యార్థులు పడుతున్న బాధలను గమనించి న్యాయం చేయవలెనని ఆయన అధికారులను కోరారు

## జనసేన క్రియాశీల సభ్యులకు బీమా సౌకర్యం

### బాధితుని కుటుంబానికి రూ 5 లక్షలు అందించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం జులై 31 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వం చేయించుకొని ప్రమాదవ శాత్తు మృతి చెందిన క్రియాశీలక మృతుల కుటుంబాలకు రూ 5 లక్షలు అందించడం జరుగుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. జనవరిలో భీమవరం 38వ వార్డు లంకపేటకు చెందిన జన సైనికుడు కంట శశికుమార్ ట్రాక్టర్ యాక్సిడెంట్ లో మృతి చెందారు. వారికి జనసేన సభ్యత్వం ఉన్నందున ఆ ఇన్సూరెన్స్ సొమ్ము రూ 5 లక్షలను వారి తల్లి పార్వతి కు అందించామని ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారు. జనసేన క్రియాశీల సభ్యులకు ఆ పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తుందని అన్నారు.

## రాజేంద్రపాలెంలో ‘ఇంటింటికి తెలుగుదేశం ‘ కార్యక్రమం నిర్వహించిన గిడ్డి ఈశ్వరి



జిల్లా ఇంచార్జి జనసముద్రం న్యూస్.తేది జూలై 31

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం ఆంధ్రప్రదేశ్ :రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పాలన కొనసాగుతోందని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతున్నాయని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ‘ఇంటింటికి తెలుగుదేశం‘ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లిన గిడ్డి ఈశ్వరి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, బస్సుల్లో ఉచిత ప్రయాణం, ‘తల్లికి వందనం‘, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ, మత్స్యకార సేవలో, ఆటో డ్రైవర్ సేవలో, ట్రైకార్ రుణాలు తదితర పథకాల ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్-6 హామీలతో పాటు అదనంగా అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజలకు తెలియజేశారు. అలాగే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించి, “రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమ ఫలాలు“ పేరుతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వీర సత్యనారాయణ (దొరబాబు), మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాంబమూర్తి, కె. వరలక్ష్మి, గర్రెంగి రాజేశ్వరి, తోకల దేవి, సీనియర్ నాయకులు దారకొండ నారాయణమూర్తి, బంటు లక్ష్మయ్య, రోగల శ్రీను, లోతా సింహాచలం, గాలి చిన్నారావు, తెలుగు యువత కార్యదర్శి చక్క చంటి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు రామేశ్‌తో పాటు పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి మరోసారి గళమెత్తిన మీడియా సంఘాలు.



గోకవరం .జన సముద్రం న్యూస్ జూలై 31.

ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా పేరొందిన జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికితీసుకెళ్తుంటారు. అయితే, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే వారే తమ ప్రాథమిక హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో ఎన్నో ఇబ్బందులుఎదుర్కొంటున్నారనేవిషయం మరోసారివెలుగులోకివచ్చింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ (APWJF), ఏపీబీజేఏ (APBJA) ఆధ్వర్యంలో గోకవరం మండల తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేయడం ఈ సమస్యల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ప్రభుత్వానికి ఈ వినతిని చేరవేసి తగిన చర్యలు తీసుకోవాలనివారుకోరారు. వినతిపత్రంలో ప్రధానంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం, ఉద్యోగ భద్రత కోసం మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ పథకం అమలు, బీమా సౌకర్యాల విస్తరణ, ఏసీ బస్సుల్లో రాయితీ ప్రయాణం, జర్నలిస్టు అవార్డులు వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే, నిలిచిపోయిన “ఆంధ్రప్రదేశ్“ ప్రభుత్వ మాసపత్రికను తిరిగి ప్రారంభించాలని కూడా కోరడం విశేషం. ఇటీవలి కాలంలో డిజిటల్ మీడియా విస్తరణ, మారుతున్న మీడియా పరిస్థితుల నేపథ్యంలో జర్నలిస్టుల పని భారం పెరుగుతున్నప్పటికీ, సంక్షేమ పరంగా తగిన రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో కూడా జర్నలిస్టుల కోసం సమగ్ర సంక్షేమ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని మీడియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టుల సంక్షేమం కేవలం ఒక వర్గం సమస్య మాత్రమే కాదు, సమాజ ప్రయోజనాలకు సంబంధించిన అంశమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈ వినతిపై సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మీడియా సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీబీజేఏ జిల్లా ఉపాధ్యక్షుడు కరాసు శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల సత్తిబాబు, జిల్లా జాయింట్ సెక్రటరీ నక్కా రామరాజు, రిపోర్టర్లు షేక్ అబ్దుల్లా, జయరాజు, రామకృష్ణ, బత్తిన రాజు, వై.వి.ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136, janasamu-dram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram